సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
శుక్రవారం, 14.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 284
పేజీలు: 08 వెల: రూ. 5

## మారనున్న ధర్మపురి
మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..



- అభివృద్ధితో కొత్త ఆధ్యాత్మిక క్షేత్రంగా..
- కుంభమేళా తరహాలో పుష్కరాలు

03

## దొంగను పట్టించిన గురక
దొంగతనం చేసి.. ఆ ఇంట్లోనే గురకపెట్టి నిద్ర 03

- మద్యం మత్తులో దొంగ వింత పని
- బెడ్‌రూమ్‌లో ఉదయం దొంగను చూసి యజమానికి షాక్..



## చర్చ కంటే వాయిదాలే ఎక్కువ
వందేమాతరంతో పార్లమెంట్ కు తెర 02

- ముగిసిన వర్షా కాల సమావేశాలు
- పలు కీలక బిల్లులకు ఆమోదం
- మోదీ, రాహుల్ హాజరు



## అమరావతికి రాజమార్గం సిద్ధం
03 రాజధానికి సీడ్ యాక్సెస్

- అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు
- ఐదు కాన్సెప్టులతో దేశం మెచ్చిన రాజధానిగా అమరావతి
- స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన సీఎం చంద్రబాబు



- రేవంత్ కుటుంబంపై కేటీఆర్ ఫోకస్
- టెస్సరాక్ట్ వివాదంలో కాంగ్రెస్ డిఫెన్స్
- కేటీఆర్ అటాక్.. కాంగ్రెస్ కౌంటర్ ఎక్కడ?
- భూముల వివాదంతో రేవంత్ సర్కార్‌పై దాడి
- సీఎం సోదరుల చుట్టూ తెలంగాణ పాలిటిక్స్
- రేవంత్ సర్కార్‌ను ఇరుకున పెట్టే వ్యూహం
- భూముల వివాదంతో కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి

# రేవంత్ సోదరులే టార్గెట్
బీఆర్ఎస్ కొత్త మైండ్‌గేమ్

టెస్సరాక్ట్ భూములపై పొలిటికల్ వార్

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మరోసారి వేడెక్కింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేరుగా టార్గెట్ చేయడంతో పాటు, ఆయన సోదరులను కేంద్రంగా చేసుకుని బీఆర్ఎస్ కొత్త రాజకీయ వ్యూహానికి పదును పెడుతున్నట్లు కనిపిస్తోంది. సీఎం సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిల పేర్లను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.
ఈ వివాదం టెస్సరాక్ట్ కంపెనీకి భూముల కేటాయింపు అంశం చుట్టూ తిరుగుతోంది. విలువైన ప్రభుత్వ భూములను తక్కువ ధరకే కంపెనీకి కేటాయించారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. అంతేకాకుండా సదరు కంపెనీ వెనుక సీఎం సోదరుడు కొండల్ రెడ్డి ఉన్నారంటూ ప్రతిపక్షం తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఈ వ్యవహారాన్ని 'ఫ్యామిలీ స్కామ్' గా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది.




**కుటుంబమే రాజకీయ అస్త్రంగా..**
రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత ఆయన సోదరులు రాజకీయ, వ్యాపార వ్యవహారాల్లో చర్చకు రావడం ఇదే మొదటిసారి కాదు. తిరుపతి రెడ్డి కొడంగల్ నియోజకవర్గ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తుండగా.. కొండల్ రెడ్డి వ్యాపార రంగంలో ఉన్నారు. ఇప్పుడు ఈ ఇద్దరి పేర్లను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ దాడి చేయడం ద్వారా సీఎం ఇమేజ్‌ను దెబ్బతీయాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది.
కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతిపై గతంలో కాంగ్రెస్ చేసిన విమర్శలకు ఇదే తరహాలో కౌంటర్ ఇవ్వాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 'అధికారం మారినా కుటుంబ ప్రయోజనాల రాజకీయాలు మారలేదనే' భావనను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ ప్రచారం వెనుక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

**కాంగ్రెస్ కౌంటర్ ఎక్కడ?**
బీఆర్ఎస్ ఆరోపణలకు కాంగ్రెస్ నుంచి ఆశించిన స్థాయిలో రాజకీయ కౌంటర్ కనిపించడం లేదనే చర్చ మొదలైంది. ముఖ్యంగా టెస్సరాక్ట్ కంపెనీకి, కొండల్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదనే అంశంపై స్పష్టమైన, పూర్తి స్థాయి వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ అంశంపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందిస్తూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన పారిశ్రామిక విధానాలు, నిబంధనల ప్రకారమే భూముల కేటాయింపులు జరిగాయని, ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. అయితే కేవలం విధానపరమైన అంశాలను వివరించడం కంటే.. ఆరోపణల్లో ప్రస్తావిస్తున్న వ్యక్తులు, కంపెనీల మధ్య సంబంధాలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. మిగతా 02లో



## ఓటుకు నోటులో
# బిగ్ ట్విస్ట్!
మళ్లీ మొదటికి కేసు!

కొత్త బెంచ్ ముందుకు, తప్పనిసరి రీహియరింగ్
సీజేఐ సూర్యకాంత్ కీలక ఆదేశాలు

**ముద్ర హైదరాబాద్:**
రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రకంపనలు సృష్టించిన సంచలనాత్మక ఓటుకు నోటు కేసు విచారణలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ మళ్లీ మొదటికొచ్చింది. గతంలో ఈ కేసులో విచారణ జరిపి తీర్పు రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. అయితే, సుదీర్ఘంగా వాదనలు విన్న ధర్మాసనంలోని న్యాయమూర్తులు ఇటీవలే పదవీ విరమణ పొందడంతో, నిబంధనల ప్రకారం ఈ కేసు వాదనలను మళ్లీ మొదటి నుంచి వినాల్సి ఉంటుందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. దీంతో మరోసారి ఓటుకు నోటు కేసు విచారణ తెరపైకి రానుంది.

**కొత్త ధర్మాసనం విచారించాల్సిందే..**
అయితే, పదేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాల్లో పొలిటికల్ హీట్ పుట్టించిన 'ఓటుకు నోటు' వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో గతంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. అయితే, ఆ వాదనలు విన్న బెంచ్‌లోని జడ్జీలు రిటైర్ కావడంతో సాంకేతిక కారణాల వల్ల విచారణ పూర్తికాకుండా నిలిచిపోయింది. కేసుల కేటాయింపు (Roster) ప్రక్రియలో భాగంగా ఈ వ్యవహారం సీజేఐ ముందుకు రాగా, న్యాయ ప్రక్రియ నియమాల ప్రకారం పాత మిగతా 02లో

## రేవంత్ రెడ్డి విదేశీ
# పర్యటన కుదింపు
అమెరికా, బ్రిటన్ పర్యటనకే పరిమితం

- పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి
- తెలంగాణ రైజింగ్ పై సీఎం ఫోకస్!
- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో టూర్ షెడ్యూల్లో మార్పులు

**ముద్ర , హైదరాబాద్:**
తెలంగాణ సమగ్రాభివృద్ధి, భారీగా గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించడం, యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. అయితే సెప్టెంబర్ మొదటి వారంలో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సీఎం తన విదేశీ పర్యటన షెడ్యూల్‌ను కుదించినట్లు తెలుస్తోంది. తొలుత జర్మనీ, చైనా సహా పలు దేశాల్లో సుదీర్ఘంగా పర్యటించాలని ప్రణాళిక రూపొందించారు. తాజా షెడ్యూల్ ప్రకారం అమెరికా, బ్రిటన్ పర్యట మిగతా 02లో



## బీసీ మహిళలకు
# ప్రభుత్వం వరం
02

ప్రతి నియోజకవర్గానికి 1,000 మిషన్లు



- 100% సబ్సిడీతో ఆటోమేటిక్ మిషన్లు
- మహిళలకు స్వయం ఉపాధి లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 1.19 లక్షల మిషన్లు

## సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు
# హెచ్చరిక




- ఫుడ్ ప్రొడక్టుల ప్రచారంపై FSSAI నజర్
- తప్పుడు ఆరోగ్య క్లెయిమ్స్ చేస్తే చర్యలు
- ఇన్‌ఫ్లుయెన్సర్లు జాగ్రత్తగా ప్రచారం చేయాలి
- శాస్త్రీయ ఆధారాలుంటేనే హెల్త్ క్లెయిమ్స్
- వినియోగదారులను తప్పుదోవ పట్టించొద్దు

02

## ముఖ్యమంత్రివా?
# రియల్ ఏజెంటువా?
02

రాయదుర్గ్ హెరిటేజ్ భూముల వేలం ఆపాలి

రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన హరీశ్ రావు

కోర్టు వివాదంలోని భూములు వేలం వేయడం ఏమిటి

రేవంత్ సర్కార్ కు న్యాయ వ్యవస్థపై గౌరవం లేదు

కొనుగోలు దారులకు సమస్యలు తప్పవు



## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం, 14.08.2026
www.mudranews.in | @mudranews



## బాదం నూనె : ఫైన్ లైన్స్ తగ్గేందుకు



బాదం నూనెలో ఉండే విటమిన్ E వంటి పోషకాలు చర్మ సంరక్షణకు ఉపయోగపడతాయి. క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల చర్మం ఆరోగ్యంగా కనిపించవచ్చు.



# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు హెచ్చరిక

**ముద్ర, ఢిల్లీ:**
ఫుడ్ ప్రొడక్టులను ప్రచారం చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, సెలబ్రిటీలు జాగ్రత్తగా వ్యవహరించాలని FSSAI హెచ్చరించింది. ఉత్పత్తుల గురించి ధ్రువీకరించని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ప్రత్యేకంగా 'ఇమ్యూనిటీ పెంచుతుంది', 'ప్రొటీన్ లోపాన్ని తీరుస్తుంది' వంటి ఆరోగ్య క్లెయిమ్స్ చేసే ముందు శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించింది. ప్యాకేజింగ్, పోషక విలువలు, తయారీదారు పేర్కొన్న క్లెయిమ్స్‌ను పరిశీలించిన తర్వాతే ఉత్పత్తులను ప్రమోట్ చేయాలని FSSAI పేర్కొంది. వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేయొద్దన్నారు.

18 రోజులై

# చర్చ కంటే వాయిదాలే ఎక్కువ



**ముద్ర ఢిల్లీ :**
ప్రతిపక్షాల తీవ్ర నిరసనలు, ఆందోళనల నడుమ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం వందేమాతర గీతాలాపన అనంతరం లోక్‌సభను స్పీకర్ నిరవధికంగా వాయిదా వేశారు. చివరి రోజు సమావేశాలకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరయ్యారు. దాదాపు 18 నుంచి 19 రోజుల పాటు సాగిన ఈ సమావేశాలు ఎలాంటి అర్థవంతమైన చర్చలు లేకుండా, ప్రతిరోజూ వాయిదాలకే పరిమితం కావడం గమనార్హం. సభ లోపల, వెలుపల అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయిలో నిరసనలు చోటుచేసుకున్నాయి.
ప్రతిపక్షాల తీరుపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన 30 ఏళ్ల పార్లమెంటరీ జీవితంలో ఇంత బాధ్యతారాహిత్యమైన ప్రతిపక్షాన్ని ఎప్పుడూ చూడలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు దేశంలోని తీవ్రమైన సమస్యలపై చర్చించకుండా ప్లకార్డులతో నినాదాలు చేస్తూ పారిపోతున్నాయని ఆరోపించారు. నీట్ పరీక్షలు, విద్యార్థుల ఆందోళన వంటి కీలక విషయాలపై చర్చకు ప్రభుత్వం వెంటనే సిద్ధంగా ఉందని, స్వయంగా హోం మంత్రి అమిత్ షా సమాధానాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా ప్రతిపక్షం వెనకడుగు వేస్తోందని స్పష్టం చేశారు. మరోవైపు పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద ఇండియా కూటమి ఎంపీలు నిరసనలు చేపట్టారు. జూలై 20న విద్యార్థులపై జరిగిన చర్యలతో పాటు రామమందిర విరాళాల వ్యవహారంపై హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. చివరి రోజున కూడా హోం మంత్రికి వ్యతిరేకంగా విపక్షాల ప్రచారం కొనసాగగా, ఎన్డీయే, ప్రతిపక్షాలు పోటాపోటీగా నినాదాలు చేసుకోవడంతో పార్లమెంట్ ఆవరణ ఉద్రిక్తంగా మారింది.

# 'ఓటుకు నోటు' కేసులో బిగ్ ట్విస్ట్

**(మొదటి పేజీ తరువాయి)**
వాదనలను పరిగణనలోకి తీసుకోలేమని సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ తెలిపారు. అందువల్ల ఈ కేసును కొత్త ధర్మాసనం విచారించాల్సి ఉంటుందని, మొదటి నుంచే పూర్తి స్థాయి వాదనలు వింటామని వెల్లడించారు. రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న కేసు కావడంతో, దీనిని వేగవంతంగా విచారించేందుకు వీలుగా త్వరలోనే ఓ ప్రత్యేక ధర్మాసనాన్ని కేటాయించబోతున్నట్లుగా తెలుస్తోంది. నూతన బెంచ్ ఏర్పాటు తర్వాత పిటిషనర్లు, ప్రతివాదుల తరఫు న్యాయవాదులు తమ వాదనలను మళ్లీ ఫ్రెష్‌గా వినిపించనున్నారు. ఇన్నాళ్లు ఉలుకూ పలుకూలేని 'ఓటుకు నోటు' వ్యవహారం సుప్రీంకోర్టులో రీ హియరింగ్ కానుండటంతో అటు న్యాయవాదుల్లోనూ.. ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.



# బీసీ మహిళలకు ప్రభుత్వం వరం

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద, నిరుద్యోగ బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక అభివృద్ధి కోసం ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గానికి 1000 మంది చొప్పున, వంద శాతం సబ్సిడీతో ఆటోమేటెడ్ కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నట్లు సచివాలయం వేదికగా పేర్కొన్నారు.

**పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు**
మహిళా ఆర్థిక స్వావలంభనే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బలహీనవర్గాల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్న పొన్నం ప్రభాకర్, సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ ఛాంపియన్ అని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని స్పష్టం చేశారు. స్వయం ఉపాధి, టైలరింగ్, వ్యాపార అవకాశాలతో మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు.

**నియోజకవర్గానికి 1000 మిషన్లు**
రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి 1,000 చొప్పున మిషన్లు కేటాయించామని మంత్రి తెలిపారు. తెలంగాణలో మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను బీసీ మహిళలకు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. బీసీ మహిళలకు నియోజకవర్గానికి 1000 ఆటోమేటిక్ కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నాం. బలహీనవర్గాల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ ఛాంపియన్నం. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

**ఆధునిక ఆటోమేటిక్ మిషన్లు**
పాతకాలపు చేతి మిషన్ల కంటే వేగంగా, తక్కువ శ్రమతో ఎక్కువ దుస్తులు కుట్టడానికి వీలుగా ఉండే ఆటోమేటిక్ కుట్టు మిషన్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తోంది. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో కుట్టు మిషన్లు అందించడం ఈ పథకం ప్రత్యేకత. ఆధునిక కుట్టు మిషన్ల ద్వారా మహిళలు ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందుతూ తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తెలిపారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆదాయం ఆర్జించే స్వయం ఉపాధి మహిళలుగా, భవిష్యత్ మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ పథకం లక్ష్యమని వివరించారు.





# రేవంత్ పర్యటన కుదింపు

**(మొదటి పేజీ తరువాయి)**
నలకే పరిమితం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ పర్యటనలో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ కంపెనీలకు వివరించడంతో పాటు, రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడంపై సీఎం ప్రధానంగా దృష్టి సారించనున్నారు. అలాగే యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలపై చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రాష్ట్రంలో పాలనకు ఇబ్బంది కలగకుండా విదేశీ పర్యటనను కుదించినట్లు సమాచారం. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై సీఎం రేవంత్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# రేవంత్ సోదరులే టార్గెట్



**(మొదటి పేజీ తరువాయి)**

**డాక్యుమెంట్లతో కౌంటర్ ఇవ్వాల్సిందే!**
పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించిన భూములను నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించాల్సి ఉంటుందని, వాటిని ఇష్టానుసారంగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు మళ్లించే అవకాశం ఉండదని కాంగ్రెస్ చెబుతోంది. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా బలంగా వివరించడంలో అధికార పార్టీ విఫలమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.
మరోవైపు, బీఆర్ఎస్ మాత్రం ఆరోపణలను సోషల్ మీడియా, మీడియా వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తోంది. దీంతో కాంగ్రెస్‌పై రాజకీయ ఒత్తిడి పెరుగుతోంది. ఆరోపణలను కేవలం ప్రకటనలతో తిప్పికొట్టకుండా.. భూముల కేటాయింపునకు సంబంధించిన పూర్తి వివరాలు, కంపెనీ యాజమాన్య నిర్మాణం, సంబంధిత పత్రాలను ప్రజల ముందుంచితేనే ఈ వివాదానికి తెరపడే అవకాశం ఉంది.

**చిన్న వివాదమే.. పెద్ద రాజకీయ నష్టమా?**
టెస్సరాక్ట్ భూముల వ్యవహారం వాస్తవంగా ఎంత పెద్ద వివాదమన్నది పక్కన పెడితే.. దాన్ని రాజకీయంగా ఎలా మలచాలన్న విషయంలో బీఆర్ఎస్ స్పష్టమైన వ్యూహంతో ముందుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల పేర్లను పదేపదే తెరపైకి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయాలని ప్రయత్నిస్తోంది.
కాంగ్రెస్ మాత్రం ఆరోపణలకు వేగంగా, ఆధారాలతో సమాధానం ఇవ్వకపోతే.. చిన్నచిన్న ఆరోపణలే కాలక్రమంలో పెద్ద రాజకీయ నెరేటివ్‌గా మారే అవకాశం ఉంది. దీంతో టెస్సరాక్ట్ భూముల వివాదం కేవలం భూ కేటాయింపుల అంశంగానే కాకుండా.. రేవంత్ సర్కార్ ఇమేజ్‌కు సంబంధించిన కీలక రాజకీయ పోరుగా మారుతోంది.

# బర్త్ టూరిజానికి ట్రంప్ చెక్.. 600 వీసాలు రద్దు

**ముద్ర, నేషనల్ డెస్క్:**
అమెరికాలోకి వలసల నియంత్రణకు ట్రంప్ కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వీసా నిబంధనలు కఠినం చేశారు. ఫీజు భారీగా పెంచారు. హెచ్–1బీ వీసాల జారీని తగ్గించారు. ఇక ఇప్పుడు బర్త్ టూరిజంపై దృష్టిపెట్టారు. అమెరికాలో జన్మించిన పిల్లలకు అక్కడి పౌరసత్వం లభిస్తుందని విదేశీ గర్భిణులు అక్కడికి వెళ్లి ప్రసవం చేసుకుంటున్నారు. ఈ పద్ధతిని అరికట్టేందుకు ట్రంప్ తీవ్ర చర్యలు చేపట్టారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, వందలాది వీసాల రద్దు ద్వారా పౌరసత్వం దుర్వినియోగం నియంత్రించేందుకు జరుగుతోంది.

**బర్త్ టూరిజం అంటే ఏమిటి?**
బర్త్ టూరిజం అనేది విదేశీయులు నాన్–ఇమ్మిగ్రెంట్ వీసాలపై అమెరికాకు వచ్చి అక్కడ ప్రసవం చేసి, పిల్లలకు అమెరికన్ పౌరసత్వం సంపాదించుకునే వ్యవస్థ. దీని వెనుక తరచుగా సంస్థలు, మధ్యవర్తులు ఉంటారు. వారు వీసా ఇంటర్వ్యూలకు సన్నాహాలు, నివాస ఏర్పాట్లు, ఆసుపత్రి సౌకర్యాలు అందిస్తూ లాభాలు పొందుతారు. ఇది వీసా వ్యవస్థను దుర్వినియోగం చేసి, పౌరసత్వాన్ని 'కొనుగోలు' చేసే తీరు. పౌరసత్వం అనేది హక్కు కాదు, ప్రత్యేక అవకాశం అని అధికారులు నొక్కి చెబుతున్నారు. సుప్రీంకోర్టు బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌ను రక్షించిన తర్వాత కూడా, వీసా దశలోనే దీన్ని అడ్డుకునే మార్గాలపై దృష్టి సారించారు.

**గర్భిణుల వీసాలు రద్దు..**
ఈ జులైలోనే తొమ్మిదవ నెల గర్భంతో అమెరికాలో అడుగుపెట్టిన వందలాది మహిళల వీసాలను విదేశాంగ శాఖ రద్దు చేసింది. మొత్తం 600కు పైగా వీసాలు రద్దయ్యాయి. బర్త్ టూరిజం నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఇది హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగంతో కలిసి వీసా హోల్డర్ల కార్యకలాపాలను పరిశీలించి, సంబంధిత వ్యక్తులు, నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకుంటోంది. ఇటీవలి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ కూడా ఈ దిశగా స్పష్టమైన విధానాన్ని నిర్దేశించింది. వీసా దరఖాస్తులలో ప్రయాణ ఉద్దేశ్యం గురించి తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై కఠిన చర్యలు, కొన్ని సందర్భాల్లో శాశ్వత నిషేధం కూడా ఉన్నాయి.

**పౌరసత్వ సమగ్రత..**
ఈ చర్యలు పౌరసత్వ వ్యవస్థ సమగ్రతను కాపాడుతాయని మద్దతుదారులు అంటున్నారు. వీసా వ్యవస్థను ఉద్దేశ్యం ప్రకారం మాత్రమే ఉపయోగించాలని నొక్కి చెప్పడం ద్వారా చట్టబద్ధత పెరుగుతుంది. అయితే, విమర్శకులు కొన్ని అంశాలను లేవనెత్తుతున్నారు. నిజమైన వైద్య అవసరాలతో లేదా ఇతర చట్టబద్ధ కారణాలతో వచ్చే గర్భిణులపై అనుమానాలు పెరగవచ్చు. అమలు సమయంలో వివక్ష లేదా అతి ఉత్సాహం ఉంటే అన్యాయం జరగే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా ఇది అమెరికా వీసా విధానాలపై ప్రభావం చూపుతుంది. ఇతర దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు మరింత పరిశీలనకు లోనవుతారు. దీర్ఘకాలంలో బర్త్ టూరిజం సంఖ్య తగ్గవచ్చు. ట్రంప్ పాలన బర్త్ టూరిజంపై ఉక్కుపాదం మోపుతూ, వీసా వ్యవస్థను కఠినంగా అమలు చేస్తోంది. 600 వీసాల రద్దు ఒక సంకేతం మాత్రమే.



# పేలుడు అల్‌ఖైదా పనే

## ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆందోళన

**ముద్ర, నేషనల్ డెస్క్:**
గతేడాది నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్సీ) తాజా నివేదిక ఆ దాడి చేసింది అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్ (ఏక్యూఐఎస్)అని అధికారికంగా ప్రకటించింది. దక్షిణాసియాలో ఉగ్రవాదం రూపాంతరం చెందుతున్న విధానంపై ఆందోళన వ్యక్తం చేసింది.

**అంతర్జాతీయ గుర్తింపు**
ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో కారులో జరిగిన అధిక తీవ్రత గల పేలుడు సాధారణ ప్రజలను లక్ష్యంగా చేసుకుంది. భారతీయ దర్యాప్తు ఏజెన్సీలు ఇప్పటికే అనేక మందిని అరెస్ట్ చేసి, చార్జ్‌షీట్ దాఖలు చేశాయి. ఇప్పుడు యూఎన్ఎస్సీ మానిటరింగ్ టీమ్ నివేదిక ఈ దాడిని ఏక్యూఐఎస్‌కు అధికారికంగా లింక్ చేయడం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఇచ్చింది. నివేదిక ప్రకారం, ఏక్యూఐఎస్ విచ్ఛిన్నమైన సమూహం నుంచి ప్రాంతీయ ఉగ్రవాద సంస్థగా మారుతోంది. ఇది లాజిస్టిక్స్, ఆర్థిక నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసుకుంది. పెద్ద యూనిట్లకు బదులు చిన్న, వికేంద్రీకృత సెల్‌ల ద్వారా పనిచేస్తోంది. ఈ వ్యూహం గుర్తించడం కష్టతరం చేస్తుంది, పెద్ద నెట్‌వర్క్‌లను అణచివేయడం సులభమైనప్పటికీ, చిన్న సమూహాలు పనిచేస్తాయి.

**ప్రాంతీయ ముప్పు..**
నివేదికలో మరో కీలక అంశం ఉంది. ఏక్యూఐఎస్ బంగ్లాదేశ్‌లో సెల్‌లు ఏర్పాటు చేసుకునే ప్రయత్నాలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారత్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా సవాళ్లను పెంచుతుంది. అల్‌ఖైదా, ఇతర ఉగ్ర సంస్థలు రసాయన, జీవ ఆయుధాలపై ఆసక్తి చూపుతున్నా, సాంకేతిక అడ్డంకుల కారణంగా వాటిని అభివృద్ధి చేయలేకపోయాయని కూడా పేర్కొనబడింది. అయినప్పటికీ, ఆన్‌లైన్‌లో అటువంటి సమాచారం వ్యాప్తి చెందడం ప్రమాదకరం. భారత దర్యాప్తు సంస్థలు ఇప్పటికే ఏక్యూఐఎస్‌కు సంబంధించిన అన్సార్ ఘజ్వత్–ఉల్–హింద్ వంటి గ్రూపుల లింకులను గుర్తించాయి.

**భారత్‌కు సవాళ్లు..**
ఈ నివేదిక భారత్ భద్రతా వ్యవస్థకు హెచ్చరిక. పెద్ద ఎత్తున దాడులకు బదులు చిన్న, అపారదర్శక సెల్‌ల ద్వారా దాడులు జరగడం మరింత కష్టతరం. ఆర్థిక నెట్‌వర్క్‌లు, లాజిస్టిక్స్‌ను అడ్డుకోవడం, సరిహద్దు నిఘా బలోపేతం, పొరుగు దేశాలతో సమాచార మార్పిడి అవసరం. అదే సమయంలో, రాడికలైజేషన్‌ను నివారించే సామాజిక, విద్యా కార్యక్రమాలు కూడా ముఖ్యం. ఏక్యూఐఎస్ గుర్తింపు అంతర్జాతీయ సహకారానికి ద్వారాలు తెరుస్తుంది. అయితే, అసలు పని భారత్‌లోనే జరగాలి. నిఘా, నివారణ, వేగవంతమైన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి.

### బాదం నూనె : కళ్ల కింద చర్మానికి

రాత్రి పడుకునే ముందు బాదం నూనెను చాలా తక్కువ మోతాదులో కళ్ల చుట్టూ చర్మానికి అప్లై చేయవచ్చు. పొడిబారకుండా చర్మాన్ని మృదువుగా ఉంచడంలో ఇది సహాయపడుతుంది.



# ముఖ్యమంత్రివా? రియల్ ఎస్టేట్ ఏజెంటువా?

**రాయదుర్గ్ హెరిటేజ్ భూముల వేలం ఆపాలి**
**కోర్టు వివాదంలోని భూములు వేలం వేయడం ఏమిటి**
**రేవంత్ సర్కార్ కు న్యాయ వ్యవస్థపై గౌరవం లేదు**
**కొనుగోలుదారులకు భవిష్యత్లో న్యాయపరమైన సమస్యలు తప్పవు**
**రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన హరీశ్ రావు**

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు.కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో TGIIC వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు.



ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు.

నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..'ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు.

సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా థర్డ్ పార్టీ ఇంట్రెస్ట్ సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న TGIIC వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు.

భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవుపలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

## 15న సాయంత్రం 'ఎట్ హోమ్'

**ముద్ర, హైదరాబాద్ :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన సాయంత్రం 6 గంటలకు లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆధ్వర్యంలో 'ఎట్ హోమ్' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇప్పటికే కార్యక్రమ ఆహ్వానితులకు ఆహ్వాన పత్రికలు పంపినట్లు గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్ తెలిపారు.

ఆహ్వానితులు సాయంత్రం 5.30 గంటలకల్లా లోక్ భవన్‌లోని 'ఎట్ హోమ్' కార్యక్రమం నిర్వహించే లోక్ భవన్ లాన్స్ వద్దకు చేరుకోని తమకు కేటాయించిన సీట్లలో ఆసీనులు కావాలనీ ఆయన సూచించారు. ఆహ్వాన పత్రికనే ఎంట్రీ పాస్ గా పనిచేస్తుందని,ఎట్ హోమ్ కు వచ్చే ముందు ఆహ్వానితులు తప్పనిసరిగా తమ వెంట ఆహ్వాన పత్రిక ను వెంట తీసుకురావాలని కోరారు.

## ధర్మపురి క్షేత్రం అభివృద్ధితో మారనున్న రూపురేఖలు..

**కుంభమేళా తరహాలో పుష్కరాలు నిర్వహిస్తాం**
**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**

**ముద్ర, ధర్మపురి:** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నా మని ధర్మపురి క్షేత్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో ధర్మపురి రూపురేఖలు మారనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గురువారం ధర్మపురి 15వ వార్డు అంబేద్కర్ భవన నిర్మాణ పనులను మంత్రి అడ్లూరి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ధర్మపురి పట్టణంలోని వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ధర్మపురిలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా అంబేద్కర్ భవన నిర్మాణం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామని తెలిపారు. మరో రెండు అంతస్తులు విద్యార్థుల చదువు కావలసిన ఏర్పాట్లు చేస్తామని మంత్రి వివరించారు.

ధర్మపురి క్షేత్రం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం రూ.117 కోట్లు కేటాయించగా ఇందులో ధర్మపురిలో రూ. 37 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. వీటితోపాటు టి



యు ఎఫ్ ఐ డి సి నిధులు రూ. 15 కోట్లతో పాటు అమృత పథకం ద్వారా నిధులు సాధించి ధర్మపురి లో అభివృద్ధి పనులు కొనసాగిస్తామని మంత్రి వివరించారు.

ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ధర్మపురి క్షేత్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగి ధర్మపురి రూపురేఖలు మారనున్న ట్లు మంత్రి వివరించారు. మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్ తోపాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్

**అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు**



ముద్ర, అమరావతి, ఆగస్టు 13: సీడ్ యాక్సెస్ రహదారి, బకింగ్‌హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. దీంతో అమరావతికి మెరుగైన కనెక్టివిటీ ఏర్పడిందని, రాజధాని నిర్మాణంలో ఇది తొలి అడుగని సీఎం అన్నారు. రాయపూడి నుంచి వెంకటపాలెం, పెనుమాక మీదుగా ఉండవల్లి వరకు ఈ రహదారిని సీఆర్డీఏ నిర్మించింది. మూడో దశలో తాడేపల్లి సమీపంలో జాతీయ రహదారి–16కు అనుసంధానం చేయనున్నారు. అమరావతిని కాలుష్య రహిత, డీప్‌టెక్ రాజధానిగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తెలిపారు. నో పోల్స్, బ్లూ, గ్రీన్, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం డీప్‌టెక్ అనే ఐదు కాన్సెప్టులతో నగర నిర్మాణం జరుగుతోందన్నారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా అమరావతిని అభివృద్ధి చేసి 2028 నాటికి దేశం మెచ్చే రాజధానిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల త్యాగాన్ని సీఎం కొనియాడారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాయపూడిలో నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి చంద్రబాబు పరిశీలించారు.

## రైతులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందాలి



**ముద్ర, హైదరాబాద్ :** రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, సహకార తదితర శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిర్ధారించిన 9 వరి రకాలను సాగు చేసిన రైతులు ఏఈఓల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకునేలా రైతువేదికల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణను వేగవంతం చేసి, రైతులకు రెండు మూడు రోజుల్లోనే మొక్కలు అందేలా చూడాలని ఆదేశించారు. నకిలీ డీఏపీ తయారీకి సంబంధించి 8 మందిపై కేసులు నమోదు చేసి, 6 మందిని అరెస్ట్ చేసినట్లు అధికారులు మంత్రికి తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తుమ్మల ఆదేశించారు. మార్కెట్లలో ఆర్‌డీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని, మార్కెట్ యార్డులు, మిర్చి కోల్డ్ స్టోరేజీల్లో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అలాగే కోస్టారికా నుంచి నూతన రకం ఆయిల్‌పామ్ విత్తనాల సరఫరాపై ఏఎస్‌డీ కంపెనీ ప్రతినిధులతో మంత్రి చర్చించారు. తెలంగాణ వాతావరణానికి అనుకూలతను పరిశీలించి, ప్రయోజనకరంగా ఉంటే రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.సమీక్ష సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, కోఆపరేటివ్ కమిషనర్ రాహుల్ రాజ్, హాకా ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ, హార్టికల్చర్ యూనివర్సిటీల వీసీలు జానయ్య, రాజిరెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.

# "ఇందిరమ్మ ఇండ్ల" టవర్స్ కు సీఎం శంకుస్థాపన

**కూకట్‌పల్లి అభివృద్ధికి అన్ని అధికారాలు ఉన్నాయి: సీఎం రేవంత్‌రెడ్డి**

ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 13: కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఇందిరమ్మ ఇండ్లు' టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిధుల కొరతతో అభివృద్ధి చేయలేకపోయానని, ప్రస్తుతం అన్ని అధికారాలు ఉన్నందున కూకట్‌పల్లిని ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

పేదలకు సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పట్టణ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు తొలి విడతలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని, భూముల విషయంలో ఆందోళన అవసరం లేదని సీఎం భరోసా ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తామని, అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.



## దొంగతనం చేసి.. ఆ ఇంట్లోనే గురకపెట్టి నిద్రపోయాడు..

**- మద్యం మత్తులో దొంగ వింత పని**



**ముద్ర, హైదరాబాద్:** దొంగతనం చేసేందుకు ఓ ఇంట్లోకి చొరబడిన యువకుడు.. చోరీ అనంతరం అదే ఇంట్లో నిద్రపోయిన ఘటన హైదరాబాద్ పాతబస్తీలోని వాడి-ఎ-ముస్తఫా ప్రాంతంలో చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న నిందితుడు ఇంట్లోని బంగారం, మొబైల్ ఫోన్ ను చోరీ చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోకుండా బెడ్ రూమ్ లో పడుకుని గురకపెడుతూ నిద్రపోయాడు. మరుసటి రోజు ఇంటి యజమానికి గదిలో నుంచి గురక శబ్దం వినిపించడంతో తలుపు తెరిచి చూడగా నిందితుడు నిద్రపోతూ కనిపించాడు. దీంతో అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## గుమ్మడి గోపాలకృష్ణకు సంగీత నాటక అకాడమీ అవార్డు



**ముద్ర, న్యూఢిల్లీ:** ప్రముఖ రంగస్థల నటుడు, కళారత్న గుమ్మడి గోపాలకృష్ణకు 2024 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక సంగీత నాటక అకాడమీ పురస్కారం లభించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు 'నాటకరంగం–నటన' విభాగంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. నాలుగు దశాబ్దాలుగా తెలుగు నాటకరంగానికి, ముఖ్యంగా పౌరాణిక పద్యనాటకాలకు గోపాలకృష్ణ విశేష సేవలందిస్తున్నారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, హరిశ్చంద్రుడు, శ్రీనాథుడు వంటి పాత్రల్లో ఆయన నటనకు విశేష గుర్తింపు ఉంది. తెలుగు నాటక వైభవాన్ని దేశ, విదేశీ ప్రేక్షకులకు పరిచయం చేయడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ అవార్డు సందర్భంగా గోపాలకృష్ణకు పలువురు కళాభిమానులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## మండల ప్రజావాణిపై 560 మంది ఎంపీడీవోలకు శిక్షణ




**ముద్ర, హైదరాబాద్:** ప్రజల సమస్యలను అంకితభావంతో పరిష్కరించి, ప్రజలకు జవాబుదారీగా అధికారులు పనిచేయాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి సూచించారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో 560 మంది ఎంపీడీవోలకు మండల ప్రజావాణి నిర్వహణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. మండల స్థాయి ప్రజావాణి ఈ నెల 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని చిన్నారెడ్డి సూచించారు. శాఖల వారీగా డెస్కులు, హెల్ప్‌డెస్కులు, వైద్య సేవలు, తాగునీరు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు.

సీఎం ప్రజావాణి 75 శాతం సక్సెస్ రేటు సాధించిందని, అదే స్ఫూర్తితో మండల స్థాయిలోనూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీడీవోలపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ దివ్య దేవరాజన్, ప్రణాళిక శాఖ డైరెక్టర్ షేక్ మీరా, సీఎం ప్రజావాణి ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధికారి సుశీల, సీఎం ప్రజావాణి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీలకు సముచిత స్థానం కల్పించాం

**సీఎం రేవంత్ రెడ్డి**




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో జరిగిన 'మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్'లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ, ముస్లింలు తనకు రెండు కళ్లతో సమానమని అన్నారు. మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్టంగా అమలు చేసిందని తెలిపారు. మైనారిటీ యువత గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగాలు సాధించారని, అజారుద్దీన్‌కు మంత్రి పదవి, నిఖత్ జరీన్‌కు గ్రూప్–1 స్థాయి ఉద్యోగంతో పాటు రూ.3 కోట్ల నగదు బహుమతి అందించామని పేర్కొన్నారు. యువత చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలని, అందుకోసమే స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. SIR పేరుతో అర్హులైన వారి ఓట్లు తొలగించే ప్రయత్నాలను అడ్డుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలు గల్లీగల్లీ, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించి ఒక్క అర్హుడూ ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిగా మారి ఓటు హక్కును కాపాడాలని కోరారు.

## సైనికుల కుటుంబాలకు అండగా రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్



**ముద్ర, ఢిల్లీ :** రాజ్యసభ సభ్యులు శ్రీ చింతకాయల విజయ్ గారు తన గొప్ప మనసును చాటుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఎంపీగా తనకొచ్చిన మొదటి నెల జీతం మూడు లక్షల రూపాయలను, దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం ఆయన విరాళంగా అందించారు. ఈ విరాళం చెక్కును ఆయన నేరుగా భారత కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ గారికి స్వయంగా అందజేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, ప్రాణత్యాగాలు చేసిన సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందులో భాగంగానే తాను ఈ చిరు సాయం చేసినట్లు విజయ్ స్పష్టం చేశారు. పదవి చేపట్టిన వెంటనే తన తొలి వేతనాన్ని సైనికుల కుటుంబాల కోసం వెచ్చించిన విజయ్ గారి దానగుణాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శుక్రవారం 14.08.2026



మీ 'ముద్ర' వేదికంటి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## మన సంస్కృతిలో
# పసుపు – కుంకుమ

మన సనాతన భారతీయ సంస్కృతిలో కొన్ని వస్తువులు సాధారణంగా కనిపించినప్పటికీ, వాటి వెనుక తరతరాలుగా వస్తున్న గొప్ప ఆధ్యాత్మిక భావం దాగి ఉంటుంది. అలాంటి పవిత్రమైన మంగళద్రవ్యాలే పసుపు–కుంకుమలు.

మన ఇంట్లో ఏ పూజ ప్రారంభించినా, వ్రతం ఆచరించినా, శుభకార్యం మొదలుపెట్టినా, దేవతను ఆరాధించినా, సుమంగళిని గౌరవించినా పసుపు–కుంకుమకు ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. పసుపు మన సంప్రదాయంలో పవిత్రతకు, మంగళత్వానికి, శుభారంభానికి ప్రతీకగా భావించబడింది. అందుకే పూజా కార్యక్రమాల్లో పసుపుకు ప్రాధాన్యతిచ్చారు.

శుభసందర్భాలను గమనిస్తే పసుపు–కుంకుమలు మన ఆచారాల్లో అంతర్భాగంగా కనిపిస్తాయి. వివాహం వంటి మంగళకార్యాల్లో, వ్రతాల్లో, పూజల్లో, దేవతారాధనలో, సుమంగళి గౌరవంలో వీటికి ప్రత్యేకమైన స్థానం ఉంది. అందుకే ఇవి కేవలం పూజా సామగ్రి కాదు; మన శుభ సంకల్పానికి, మంగళభావానికి, సనాతన కుటుంబ సంప్రదాయానికి ప్రతీకలు.

సుమంగళికి పసుపు–కుంకుమ ఇవ్వడం మన సంస్కృతిలో ఎంతో అందమైన ఆచారం. ఆమెకు పసుపు–కుంకుమ అందించడం ద్వారా ఆమె జీవితంలో మంగళం, శుభం, సౌభాగ్యం



వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటాం. అందువల్ల ఇది కేవలం ఒక వస్తువును ఇవ్వడం కాదు; ఒక మంగళాశీస్సును అందించడం, మన శుభ భావాన్ని పంచుకోవడం. మన పూర్వీకులు ప్రతి ఆచారానికీ ఒక ఆధ్యాత్మిక భావాన్ని జోడించారు. పసుపులో మంగళాన్ని, కుంకుమలో శక్తి–సౌభాగ్య భావాన్ని, అక్షింతల్లో సంపూర్ణతను, దీపంలో జ్ఞానాన్ని, పుష్పంలో భక్తిని దర్శించే ఆధ్యాత్మిక దృష్టిని మనకు అందించారు.

పసుపుతో గణపతి రూపాన్ని తయారు చేసి పూజించే సంప్రదాయం ఉంది. అలాగే కొన్ని పూజా విధానాల్లో పసుపుతో గౌరీదేవి రూపాన్ని సిద్ధం చేసి ఆరాధిస్తారు. సాధారణమైన పసుపుకు దైవస్వరూపాన్ని కల్పించి, మంత్రపూర్వకంగా పూజించడం మన సనాతన ధర్మంలోని దైవభావానికి ఒక అందమైన ఉదాహరణ. పసుపుతో ముడిపడిన కుంకుమకు కూడా మన సంస్కృతిలో విశిష్టమైన స్థానం ఉంది. దేవతకు కుంకుమ సమర్పించడం, పూజలో ఉపయోగించడం, పూజ అనంతరం ప్రసాదంగా స్వీకరించడం వంటి ఆచారాలు మనలో భక్తి, శుభభావనలను పెంపొందిస్తాయి.

నుదుటిపై కుంకుమ ధరించడం కేవలం అలంకారం కాదు; దైవస్మరణతో, మంగళభావంతో జీవించాలనే ఆంతర్యాన్ని గుర్తుచేసే పవిత్ర చిహ్నంగా మన సంప్రదాయం దానికి స్థానం ఇచ్చింది. మన జీవితంలోని

అందుకే పూజా మందిరంలో పసుపు–కుంకుమ కనిపించినప్పుడు వాటిని సాధారణమైన వస్తువులుగా మాత్రమే చూడకుండా, మన పూర్వీకులు తరతరాలకు అందించిన మంగళసంప్రదాయానికి పవిత్రమైన గుర్తులుగా భావించాలి. పసుపు–కుంకుమలు మన ఇంటి అలంకారం కాదు, మన సనాతన సంస్కృతి అందించిన మంగళానికి చిరునామా.

# వేశ్య.. సాధువు స్వర్గం.. నరకం..!



**డాక్టర్ మహ్మద్ హసన్**
వ్యక్తిత్వ వికాస నిపుణులు
సెల్ నెం.9908059234



ఓ గ్రామ పొలిమేరలోని ఇంట్లో ఓ 'వేశ్య' ఒంటరిగా ఉండేది. ఆ ఇంటికి ఎదురుగా ఓ "సాధువు" ఉండేవాడు. అతడు ప్రతిరోజు ఒంటరిగా వున్న వేశ్య వచ్చి ఇంటికి వెళ్ళే విటులను గమనించేవాడు. ఆమె చేస్తున్న పనిపట్ల సాదువు కోపముతో ఉండేవాడు. ఒకరోజు సాధువు ఆ మహిళతో ఇంకా ఎన్ని పాపాలు చేస్తావు? నువ్వు ఇంకా బరి తెగించి ప్రవర్తిస్తే నీకు నరకంలో "స్థలం" కూడా ఉండదు. సాధువు చెప్పిన మాటలకు భయపడి తను చేస్తున్న "వేశ్య" వృత్తిని మానుకుంది. ఏదైన పని చేసుకొని పొట్ట నింపుకోవాలని ప్రయత్నించి చాలా రోజులు ప్రయత్నం చేసింది. కానీ ఆమెకు ఎవ్వరు పని ఇవ్వలేదు దొరకలేదు కూడా. పస్తులతో రోజులు గడిపింది. ఇక లాభం లేదనుకొని తిరిగి మళ్ళీ గతంలో ఏదైతే "వేశ్య" వృత్తిని కొనసాగించిందో దానినే మళ్ళీ మొదలుపెట్టింది. "సాధువు" తన ఇంటికి ఎదురుగా వున్న "వేశ్య" ఇంట్లోకి తిరిగి విటులు రావడం పోవడం మనుషుల అలికిడిని గమనిస్తాడు.

కోపంతో వెళ్ళి ఆమెను నిందిస్తు మళ్ళీ ఈ పాపపు పని చేయడం మొదలు పెట్టావా? అని నిలదీస్తాడు. దానికి ఆ "వేశ్య" నా వద్ద వేరే అవకాశం లేదు. ఏదో ఒక పని చేసుకొని బ్రతకాలని అనుకున్నాను. కానీ ఎవ్వరు పని ఇవ్వలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో చేయాల్సి వస్తుందని రెండు చేతులు జోడించి ఏడుస్తూ విన్నవించి "క్షమించమని" ప్రాధేయ పడుతుంది. దానికి సాధువు "క్షమించాల్సింది" నేను కాదు, ఆ "భగవంతుడు" అని చిర్రుబుర్రులాడుకుంటు వెళ్ళిపోతాడు. వెళ్ళిపోతున్న సాధువునుద్దేశించి ఆ వేశ్య "గురూజీ" నాకు మీ ఆశ్రమంలోని పరిసరాలు "శుభ్రం" చేసి మీకు సపర్యలు చేసే పని ఇవ్వండి. ప్రతిఫలంగా నాకు డబ్బులు ఇస్తే సంతోషిస్తాను. దానితో నేను పొట్టపోసుకుంటాను అంటుంది.

ఆ మాటలు విన్న సాధువు కట్టలు తెంచుకున్న కోపంతో నీలాంటి పాపపు పనులు చేసే స్త్రీకి నా ఆశ్రమంలో అవకాశం ఇస్తే ఆ పరిసరాలు మొత్తం "అపవిత్రం" అయిపోతాయి అని, నువ్వు సాధ్యమైనంత త్వరగా ఇక్కడి నుండి ఇంటిని ఖాళీచేసి వెళ్ళిపొమ్మని ఆవేశంతో ఊగిపోతాడు. కానీ ఆ మహిళ బయటికి వెళ్ళలేక తనకున్న ఒకే ఒక్క దిక్కైన ఆ ఇంటిని వదిలివేస్తే జీవితం బజారున పడుతుందని భావించి క్షమించే విశాల హృదయుడు భగవంతుడున్నాడని తన వృత్తిని కొనసాగిస్తు తన దినచర్యలో మార్పులు చేసుకుంది. ఇప్పుడు ప్రతిరోజు విటులకు ఆనందానిస్తూ, తప్పనిసరి పరిస్థితులలో ఇలా చేస్తున్నందుకు "క్షమించమని" భగవంతుడిని యాచిస్తూ తన వద్ద మిగిలివున్న ఆహారాన్ని ఆ పరిసరాలలో జంతువులకు మరియు పక్షులకు దాణాగా పెట్టేది. ఈ పరిణామాలన్నీ చూస్తున్న సాధువు లోలోన రగిలిపోతూ ఉండేవాడు. అలాగే ఆ వేశ్య ఇంటికి వచ్చే ప్రతి విటుడిని లెక్కించేవాడు. యధావిధిగా విటుడు వచ్చిన ప్రతిసారి ఓ "రాయిని మూలకు" విసిరివేసేవాడు. క్రమక్రమంగా ఆ మూలకు "రాళ్ళ కుప్ప" పోగై వుంటుంది. సాధువు దగ్గరికి వచ్చే వారికి ఆ వేశ్య గురించి చెడుగా చెప్తూ మూలకువున్న "రాళ్ళ కుప్ప"ను చూయించేవాడు.

ఒకరోజు ఆ వేశ్య సాధువు కుటీరం ముందు నుండి వెళ్తూ ఉండగా "సాధువు" మూలకు వున్న రాళ్ళ కుప్పను చూయించి ఇదిగో ఆ మూలకున్న రాళ్ళ కుప్పలో ఎన్ని రాళ్ళు ఉన్నాయో అంతమంది "విటులతో" నువ్వు సంబంధం పెట్టుకున్నావు. ఇది నీ "పాపాల చిట్టా" వంటిది అంటాడు. మూలకున్న రాళ్ళ కుప్పను చూసి ఇంకా భయపడింది. ఆ రోజు రాత్రి "భోజనం" చేయలేదు.

రాత్రి మొత్తం "పశ్చాతాపం" వ్యక్తం చేస్తు ప్రాణం విడిచింది. కొద్ది రోజుల తరువాత ఆ "సాధువు" కూడా మరణిస్తాడు. స్వర్గలోకపుదారుల గుండా ఆ సాధువును నరకానికి తీసుకొని వెళ్తున్నారు యమభటులు. అప్పుడు అతడి దృష్టి స్వర్గ లోకంలో విహరిస్తున్న తన ఆశ్రమం ముందున్న "వేశ్య" మీది కి మళ్ళింది. సాధువు ఆ వేశ్యను స్వర్గంలో చూసి ఆశ్చర్యపోతాడు. నరకంలోకి వెళ్ళిన తరువాత హే భగవంతుడా ఏమిటి ఈ అన్యాయం. ప్రతిరోజు మీ "ధ్యానంలో" గడిపే నాకు "నరకం", వేశ్య వృత్తితో గడిపే అపవిత్రురాలికి "స్వర్గం" ఏమిటి వైచిత్రి? తమరు తప్పు చేయడం లేదా? చెప్పండి అని అడుగుతాడు. అప్పుడు ఆ సాధువు ముందు ఓ ఆకారం ప్రత్యక్షమై ఆ వేశ్య ఎవరిని హింసించలేదు. తన వృత్తిలో భాగంగా విటులకు సుఖాన్ని ఇచ్చింది. ఫలితంగా దాన ధర్మాలు కూడా చేసేది. అందుకే ఆమె "ఆత్మ" ఇంత "తేలికగా" మారి ఆమెకు "స్వర్గం" ప్రాప్తించింది. కానీ మీరు (సాధువు) మీ పనులలో విపరీతమైన "తప్పిదాలు" చేశారు. నన్ను స్మరిస్తున్నారనేది బహిర్గతంగా కనిపించినా, అంతర్గతంగా మాత్రం ఆ "వేశ్య" వుండే ఇంటివైపు, వచ్చిపోయే విటులపై మీ "దృష్టి" వుండేది. సమయం సందర్భం దొరికినపుడు ఆమెను అవమానించేవారు. అలాగే ఆ పాప కర్మలను గుణించడానికి/ లెక్కించడానికి "రాళ్ళ" కుప్పను పేర్చావు. నీ ఆత్మ ఆ మూలకు వున్న రాళ్ళ కుప్ప మాదిరిగా దాని క్రింద నలిగి బరువెక్కింది. అందుకే ఆ ఆత్మను (నిన్ను) నరకానికి తీసుకొని రావాల్సి వచ్చింది అంటాడు.

ఈ కథ ద్వారా మనం తెలుసుకోవాల్సిన నైతిక విలువ ఏమిటంటే ఇతరుల చెడు మరియు చెడు పనుల గురించి చర్చించటం వల్ల స్వయంగా వారి మనసు "మలినమైపోతుంది". దానితో పాటు మనం చేసే "కర్మలు" కూడా ప్రభావితం అవుతాయి. ఎప్పుడైతే మనం ఎదుటివారి చెడు గురించి ఇతరులకు చేరవేస్తు ఉంటామో లేదా నలుగురికి ఈ విషయం చేరవేయడానికి పనిగా పెట్టుకొని ప్రచారం చేస్తూ ఉంటామో. పాపాలు చేసే వ్యక్తి ఎంత ప్రభావితం అవుతాడో అంతే సమానంగా అతడి గురించి ప్రచారం చేసే వాడు కూడా ఆ పాపాలలో భాగస్వామ్యుడవుతాడు. అందుకే మీ పనులు మాత్రమే మీరు చేయండి. ఇతరులు ఏం చేస్తున్నారనేది మీకనవసరం. మీరు ఓ వ్యక్తి వద్ద "అప్పు" తీసుకున్నారు. దానిని మీరే తీర్చాల్సి వుంటుంది. దానికి మీ కుటుంబంతో కూడా సంబంధం వుండదు. అలాంటప్పుడు మీరు చేసే మంచి చెడుకు మీరే బాధ్యులు అవుతున్నప్పుడు. ఇతరులు చేసే మంచి – చెడు కర్మలకు స్వయంగా వారే బాధ్యులు అవుతారు తప్పా మీరు కాదు కదా.? ఇతరులు చేసిన అప్పును మీరు తీరుస్తారా? చెప్పండి లేదు కదా? ఇతరులు ఏం చేస్తున్నారనేది మీ కనవసరం. మీరేం చేస్తున్నారో అది లోక విరుద్ధమైనదా, లోకహితమైనదా ఆలోచించండి. అంతే కాని ఇతరుల కర్మల లో తల దూర్చి మీ తీర్పులు, మీ వ్యాఖ్యానాలు బదిలీ చేయకండి.

ఇతరులు ఏం చేస్తున్నారనేది వారి విచక్షణకు వదిలేయండి. మీ "విచక్షణ" ఏం చేస్తుందో మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఇతరుల పాపాలు లెక్కిస్తూ లెక్క "సాధువు" స్వయంగా "నరకానికి" వెళ్ళినట్లు మీరు అలాంటి పొరపాట్లు చేయకండి. ప్రవక్త "మూసా" ఓ సారి భగవంతుడిని హే ప్రభూ స్వర్గంలో నా సహచరుడు ఎవరు? అని అడిగితే దైవవాణి మాంసం వ్యాపారం చేసే "కటిక వాడు" అని చెప్పిందట. దానికి "మూసా" ఆశ్చర్యపడి అంత నిష్ఠ గల "కటిక" వాడు ఎక్కడున్నాడని వెతికే పనిలో పడి ఓ రోజు ఓ కటిక వాడిని అనుసరించాడు. అతడు దుకాణం మూసివేసిన తరువాత ఇంటికి వెళ్ళి వృద్ధురాలైన తన తల్లికి తెచ్చిన "మాంసం" వండి వడ్డించి ఆమె సపర్యలు చేయడం చూసి ఆశ్చర్యపోయాడట. అర్థమైందా కటిక వాడు చేసేది జీవుల్ని చంపటమే ఐనా అది తన వృత్తిలో భాగంగా చేసేవాడు. అలాగే తన తల్లిని "దైవ సమానంగా" భావించేవాడు. ఈ విధంగా అతడి పుణ్యాల "జాబితా" పెరిగిపోయింది. మీరు కూడా ఇతరులకు మేలు చేయాల్సివస్తే తప్పక చేయండి. కానీ మీ (List) మాటలతో చేతలతో ఇతరులను అవమానించే ప్రయత్నం చేయకండి. అది మీ తప్పుల జాబితాను పెంచుతుందే తప్పా తగ్గించదు.

## ఇందిరను చూసి భయపడిన
# అగ్రరాజ్యం

ఇందిరా గాంధీ 1984లో హత్యకు గురైన తర్వాత భారత రాజకీయాలు, విదేశాంగ విధానం, ప్రాంతీయ శక్తి సమీకరణాలు ఎలా మారాయో అందరికీ తెలుసు. కానీ ఆమె జీవించి ఉండి, దీర్ఘకాలం ప్రధానిగా కొనసాగి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో అనే ప్రశ్న ఎప్పుడూ చర్చనీయాంశం. కొన్ని వాదనలు ఆమె ధైర్యం, నిర్ణయాత్మకతను గౌరవిస్తూ, ఆమె లేకపోవడం వల్ల భారత్ కోల్పోయిన అవకాశాలను ఎత్తిచూపుతాయి.

### బలూచిస్తాన్, సింధ్ స్వాతంత్ర్యం..

ఇందిరా గాంధీ ప్రధానిగా కొనసాగి ఉంటే పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్, సింధ్ ప్రాంతాలు ఎప్పుడో స్వాతంత్ర్యం పొందేవి. 1971లో బంగ్లాదేశ్ ఏర్పాటు ఆమె నాయకత్వంలో జరిగిన అతిపెద్ద విజయం. ఆ అనుభవం, సైనిక సామర్థ్యం ఆధారంగా పాకిస్తాన్‌లోని ఇతర అసంతృప్త ప్రాంతాలను ప్రభావితం చేయగలిగేవారు. అయితే ఇందిరా గాంధీ 1971 తర్వాత కూడా పాకిస్తాన్‌పై పూర్తి స్థాయి జోక్యం చేసుకోలేదు. ఎందుకంటే యుద్ధం తర్వాత శాంతి ఒప్పందాలు, అంతర్జాతీయ ఒత్తిడి, ఆర్థిక భారం ఉన్నాయి.

### చైనా ఇప్పటికీ వెనుకబడే ఉండేది..

ఇందిరా గాంధీ కొనసాగి ఉంటే చైనా ఆర్థికంగా భారత్‌ను అధిగమించేది కాదు. 1970లలో భారత్ ఆర్థికంగా బలహీనంగా ఉండేది. లైసెన్స్ రాజ్, ప్రభుత్వ నియంత్రణ, అంతర్జాతీయ ఒడిదుడుకులు (చమురు సంక్షోభం వంటివి) ప్రభావం చూపాయి. చైనా 1978 తర్వాత డెంగ్ జియావోపింగ్ సంస్కరణలతో వేగంగా ముందుకు వెళ్లింది. ఇందిరా గాంధీ ఆర్థిక విధానాలు సామ్యవాద ధోరణితో కూడినవి. ఆమె కాలంలోనే గ్రీన్ రివల్యూషన్ విజయవంతమైంది, కానీ పారిశ్రామిక వృద్ధి, విదేశీ పెట్టుబడులు పరిమితంగా ఉన్నాయి. 1991 ఆర్థిక సంస్కరణల కారణంగా చైనా అభివృద్ధివేగం పుంజుకుంది. భారత్ వెనుకబడింది.

### అమెరికా కుట్రలు..

ఇందిరా గాంధీ హత్యను అమెరికా తెరవెనుక కుట్ర చేసింది. సిక్కుల చేతిలో ఇందిరా గాంధీ మరణించి ఉండకుంటే లాల్ బహదూర్ శాస్త్రీ మరణం తరహాలో విదేశీ పర్యటనలో అయినా చంపాలని అమెరికా ప్లాన్ వేసినట్లు విశ్లేషకుల అంచనా. 1971 యుద్ధం తర్వాత అమెరికా–భారత సంబంధాలు ఉద్రిక్తంగా మారాయి. నిక్సన్ పరిపాలన పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చింది, ఏడో నౌకాదళాన్ని బెంగాల్ బేకు పంపింది. ఇందిరా గాంధీ సోవియట్ యూనియన్‌తో సన్నిహిత సంబంధాలు పెంచుకున్నారు. ఆమె భారత్ తక్కువ కాదు అనే వైఖరి అమెరికాకు నచ్చలేదు. రిచర్డ్ నిక్సన్ కాలంలో ఉద్రిక్తతలు ఉన్నా, ప్రత్యక్ష హత్యా కుట్రకు బలమైన ఆధారాలు లేవు.

### పీవోకే భారత్‌లో భాగమయ్యేది..

1971–74 మధ్య పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)ను స్వాధీనం చేసుకోవాలని ఇందిరా గాంధీ ప్లాన్ చేశారని కొందరు చెబుతారు. 1974లో భారత్ శాంతియుత అణు పరీక్ష నిర్వహించింది. ఇది సైనిక సామర్థ్యాన్ని చూపించింది. కానీ యుద్ధం తర్వాత సిమ్లా ఒప్పందం ద్వారా సరిహద్దులు స్థిరీకరించబడ్డాయి. పూర్తి స్థాయి యుద్ధం అంతర్జాతీయ ప్రతిస్పందన, ఆర్థిక నష్టాలు తీసుకువచ్చేది. అమెరికా మద్దతు లేకపోయినా, సోవియట్ మద్దతు ఉన్నా, పూర్తి ఆక్రమణ సులభం కాదు. ఆ తర్వాత రెండు దేశాలు అణ్వాయుధాలు సంపాదించడంతో పూర్తి యుద్ధం నివారించబడింది. ఇది ఆమె కాలంలోనే మొదలైన ధోరణి.

### ప్రజా వ్యతిరేకత సృష్టి..

ఇందిరాను గద్దె దించేందకు విదేశీ శక్తులు కుట్ర చేశాయి. 1975–77 ఆపత్కాలం, జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమం, అంతర్గత రాజకీయ లోపాలు ప్రధాన కారణాలు. ఆమె ధైర్యం, నిర్ణయాత్మకత చాలా మంది అంగీకరిస్తారు. 1971 విజయం, అణు పరీక్ష, బంగ్లాదేశ్ సృష్టి ఆమె నాయకత్వానికి నిదర్శనాలు. అయితే ఇందిరా లాంటి ప్రధాని ఇప్పటి వరకు రాలేదు.

ఇందిరా గాంధీ జీవించి ఉంటే భారత్ మరింత ధైర్యంగా వ్యవహరించి ఉండేది. 1971 విజయం ఆమెకు ఇచ్చిన ఆత్మవిశ్వాసం పాకిస్తాన్, చైనా సంబంధాల్లో ప్రభావం చూపి ఉండేది. కానీ చరిత్ర ఒక్క వ్యక్తి మీద మాత్రమే ఆధారపడదు. ఆర్థిక విధానాలు, అంతర్జాతీయ శక్తి సమతుల్యత, అంతర్గత ప్రజాస్వామ్య బలం కూడా కీలకం.



## కాంగ్రెస్‌తో సంబంధం లేనివారికి
# ప్రభుత్వంలో కీలక పదవులు
## కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**ముద్ర, హైదరాబాద్ :**
కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని కొంత మంది నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం బాధాకరమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. తాను ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడతానని చెప్పారు. రవీంద్రభారతిలో కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్థానంపై రూపొందించిన పుస్తకాన్ని రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.
''గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలిసారిగా గళం విప్పింది నేనే. అందుకే అప్పటి సీఎం కేసీఆర్ లక్ష్యంగా చేసుకున్నారు. మునుగోడులో నన్ను ఓడించేందుకు 100 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దించారు. ఏపూరి సోమన్న లాంటి కళాకారులకు అండగా ఉంటా. నేను గెలిపించిన ఓ ఎమ్మెల్యే కులం కార్డు అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. రాజకీయాలను మార్చే శక్తి నాకుంది.. నిజాయతీ కలిగిన వారు నా వెంట నిలిస్తే తమిళనాడు తరహాలో రాజకీయ మార్పు తీసుకురాగలం'' అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 14.08.2026
www.mudranews.in | @mudranews



**బాదం నూనె :**
స్కాల్ప్‌కు ఆయిల్ మసాజ్ బాదం నూనెతో తలకు సున్నితంగా మసాజ్ చేయడం వల్ల స్కాల్ప్ పొడిబారకుండా ఉండేందుకు సహాయపడుతుంది. జుట్టుకు మెరుపు కూడా రావచ్చు.




# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెంచాలి

*అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి:** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని మరింత పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా డీపీసి భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, స్టేట్ టాస్ డైరెక్టర్ లింగయ్య ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు వివిధ విద్యా అంశాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యాశాఖ కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, పాఠశాలల పనితీరు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదల, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ కిరణ్మయి సమగ్రంగా సమీక్షించారు. ప్రతి మండలంలోని పరిస్థితులను సంబంధిత ఎంఈవోలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు



తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన విద్యార్థి పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, మౌలిక వసతులు, వివిధ ప్రభుత్వ సదుపాయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల నమోదు పెంపుతో పాటు వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడం, విద్యా ప్రమాణాలను పెంపొందించడం ప్రతి ఉపాధ్యాయుడి ప్రధాన బాధ్యతగా భావించాలని అదనపు కలెక్టర్ సూచించారు. పాఠశాలల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. స్టేట్ టాస్ డైరెక్టర్ లింగయ్య మాట్లాడుతూ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు లు క్షేత్రస్థాయిలో పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో మాట్లాడి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిరంతరం కొనసాగినప్పుడే విద్యాశాఖ కార్యక్రమాల అమలులో ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు. పాఠశాలల పనితీరును మెరుగుపరిచేందుకు ఎమ్ఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల నమోదు, హాజరు, అభ్యసన ఫలితాలు తదితర అంశాలపై నిరంతరం దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సమావేశంలో సమీక్షించిన అంశాలు, శాఖాపరంగా చేపడుతున్న కార్యక్రమాలు, మండలాల వారీగా విద్యా పరిస్థితులను వివరించారు. అనంతరం అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు, అన్ని మండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సిఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ వైద్యులకు టీడీపీ మద్దతు



**ముద్ర, హైదరాబాద్:** గౌరవ వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో ఆయుష్ వైద్యులు చేపట్టిన నిరసనకు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. నిరసన 10వ రోజున టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, NIMA తెలంగాణ రాష్ట్ర సలహాదారు ప్రొ. తిరునగరి జ్యోత్స్న ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు వేజండ్ల కిషోర్ బాబు మాట్లాడుతూ ఏపీలో అల్లోపతి, ఆయుష్ వైద్యులకు సమానంగా సుమారు రూ.70 వేల గౌరవ వేతనం అందుతుండగా, తెలంగాణలో ఆయుష్ వైద్యులకు తక్కువగా చెల్లించడం అన్యాయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీజీకే మూర్తి, తెలుగు యువత నాయకుడు సాయి నాగార్జున, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు రామోజు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో తిరిగి వారి సమస్యలు తెలుసుకొని వాటికి పరిష్కారించాలని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన "మండల స్థాయి సమీక్ష సమావేశం" ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించారు. అనంతరం సర్పంచ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా




ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వాహణపై సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలనీ తెలిపారు. గ్రామాల్లో వర్షాకాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, సర్పంచ్ లకు ఆదేశించారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుధీర్ గారు, స్పెషల్ ఆఫీసర్ సతర్ గారు, ఎంపీడీవో విశ్వప్రసాద్ గారు, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ గారు, ఏఎంసి చైర్మన్ వడ్డే శ్రీనివాస్ గారు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి గారు, అన్ని గ్రామాల సర్పంచ్ లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన గోల్కొండ జగదాంబికా బోనాల జాతర

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** ఆషాడ మాసం తెలంగాణ ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల ఉత్సవాలు మొదటి, చివరి పూజ గోల్కొండ కోటపై వెలసిన గోల్కొండ జగదాంబిక అమ్మవారికి నిర్వహించడం ఆనవాయితీ. గురువారం అమ్మవారికి ఆలయ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, దేవాదాయ శాఖ అధికారి వసంతల ఆధ్వర్యంలో తొమ్మిదవ పూజ నిర్వహించారు. ఇందులో భాగంగా పని వృత్తి వాళ్ళ సంఘం అధ్యక్షులు బైండ్ల శివశంకర్ ఆధ్వర్యంలో అమ్మవారికి గుమ్మడికాయల బలిహరణం, గావు కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గోల్కొండ కోటపై వెలిసిన



అమ్మవారి ఆలయం నిర్వహించారు. విశాల్ జాగరణలో నాయకులు గౌతం, సర్విన్ లు పాటలతో అందర్నీ భక్తి పారవశ్యం లో ముంచారు. విదేశీయులతోపాటు, పోలీసులు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా ఆడి పాడారు. చివరికి ఘటం, ముఖ్యమైన కుంభ హారతితో బోనాల ఉత్సవాలు



ముగిసాయి. ఈ పూజా కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ ఉదయ్ కుమార్, నాగన్న, సంతోష్ గౌడ్, దుర్గ ప్రసాద్, శోభ పాండే తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆడి పాడిన విదేశీయులకు సన్మానం చేసి, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## పోలీసులకు సన్మానం



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** బోనాల సందర్భంగా నెలరోజులపాటు పోలీసులు చేసిన సేవలు అభినందనీయమని బుజిలి మహంకాళి ఆలయ చైర్మన్ భోగి బాల్ రాజ్ అన్నారు. ఆషాడ మాస బోనాల జాతర సందర్భంగా లంగర్ హౌస్ నుండే బోనాలు ప్రారంభమై, 9 వారాలు ఇక్కడనుండి ఊరేగింపులు తీసుకెళ్లడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నెలరోజులపాటు పోలీసులు వివిధ రకాల చర్యలు తీసుకొని అటు భక్తులకు కానీ, ఇటు ప్రయాణికులకు కానీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశారు. అందుకు పోలీసు అధికారులను, వృత్తి పనివార్లను బుజిలీ మహంకాళి చైర్మన్ భోగి పాల్ రాజ్ సన్మానించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాలను వారికి అందించారు.

## మృతి చెందిన బాలిక కుటుంబానికి ఆర్థిక సాయం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రభుత్వ పాఠశాలలో వేప చెట్టు కొమ్మ పడి మృతి చెందిన విద్యార్థి అలీమా కుటుంబానికి తక్షణ సహాయంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య 10000/-, ప్రభుత్వం నుండి 50000/-, జిల్లా విద్యాధికారి 50000/-, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ 10000/- ఆర్థిక సహాయం అందజేశారు.

## ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ కార్యాచరణ

అదనపు కలెక్టర్ చంద్ర రెడ్డి

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి:** ఖరీఫ్ 2026–27 సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ చంద్ర రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ 2026–27 ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి గురువారం నిర్వహించిన కార్యాచరణ ప్రణాళిక సమావేశంలో అదనపు కలెక్టర్ వివిధ శాఖల అధికారులు, సంబంధిత సంస్థల ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో ధాన్యం కొనుగోళ్లపై సమగ్రంగా సమీక్షించారు. గత కొనుగోలు సీజన్‌లో ఎదురైన సమస్యలు, ఇబ్బందులను పరిశీలించి, అవి ఈ సీజన్‌లో పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు సుమారు 20,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారని వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి డీఆర్డీవో, డీసీఓ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, తూకం యంత్రాలు, గన్నీ బ్యాగులు, తాగునీరు,



షెడ్లు, విద్యుత్ సౌకర్యం, ధాన్యం తరలింపు వంటి అన్ని అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం నాణ్యత పరిశీలన, తూకం, కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ధాన్యం నాణ్యత పరిశీలన, తూకం, రవాణా, మిల్లులకు తరలింపు తదితర ప్రతి దశలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు స్పష్టమైన సమాచారం అందించడంతో పాటు, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు నిబంధనల ప్రకారం సకాలంలో సేవలు అందేలా చూడాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వారీగా ధాన్యం రాక, కొనుగోలు, రవాణా, మిల్లులకు తరలింపు వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గత సీజన్‌లో ఎదురైన సమస్యలు, లోపాలు, జాప్యాలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, కొనుగోలు ప్రక్రియ ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి ప్రతి స్థాయిలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అదనపు కలెక్టర్ చంద్ర రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు సకాలంలో, పారదర్శకంగా ధాన్యం కొనుగోలు సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారులు వనజాత, జిల్లా మేనేజర్ హరీష్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి

ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సమీక్ష



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తాండూర్ నియోజకవర్గ పరిధిలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం రోజున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గారిని ఇరిగేషన్ శాఖ డీఈ శంకర్ గారు, ఏఈలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వచ్చే నెలలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తాండూర్ నియోజకవర్గంలో పర్యటించే అవకాశం ఉన్న నేపథ్యంలో, పర్యటనను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గ పరిధిలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే గారు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కాగ్నా నదిలో మురుగు నీరు కలవకుండా అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు, నది పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే గారు అధికారులతో చర్చించారు. నియోజకవర్గ పరిధిలో అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, వాటి నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలు, వాటి పురోగతిపై కూడా ఆరా తీశారు. మంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకొని శాఖ పరమైన పనులు, ప్రతిపాదనలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు.

## కళాశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** విద్యార్థుల అభివృద్ధి కొరకు ప్రభుత్వం అండగా ఉంటుందని తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ పేర్కొన్నారు. గురువారం రోజున ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం అందిస్తున్న నోట్స్‌ను ప్రతి విద్యార్థికి అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు అవసరమైన మెటీరియల్ ప్రతి ఒక్కరికీ అందజేసి వారికి నాణ్యమైన విద్యను అందజేయడమే ప్రభుత్వ లక్ష్యం అని సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం మరియు కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గోదావరి జలాలపై ఏపీ కుట్రలు అడ్డుకుంటాం

తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కామెర నవీన్ కుమార్

**ముద్ర, హైదరాబాద్:** కృష్ణా నదిలో తెలంగాణకు అన్యాయం చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు గోదావరి జలాలపై కూడా కన్నేసిందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కామెర నవీన్ కుమార్ ఆరోపించారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశాలను వేదికగా చేసుకుని తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గోదావరి జలాల్లో 273 టీఎంసీల నీటిని అక్రమంగా వినియోగించుకునేందుకు ఏపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణకు ఇప్పటికే అనుమతులు లభించిన పలు ప్రాజెక్టుల అనుమతులను పునఃసమీక్షించి రద్దు చేయాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖలు రాయడం దుర్మార్గమని విమర్శించారు. తుమ్మిడిహెట్టి, కాళేశ్వరం, చిన్న కాళేశ్వరం, చనాకా–కొరాట బ్యారేజ్, మోడికుంట వాగు, కడెం–గూడెం లిఫ్ట్, సీతమ్మసాగర్–సీతారామ ఎత్తిపోతల పథకాలపై ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. దాదాపు పూర్తయిన ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని కోరడం తెలంగాణ హక్కులపై దాడి చేయడమేనన్నారు. నదీజలాల పంపిణీ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం చురుకుగా వ్యవహరించడం లేదని, ముఖ్యమంత్రి స్పందించకపోవడం బాధాకరమని నవీన్ విమర్శించారు. గోదావరి–బనకచర్ల లింక్ పేరుతో ఏపీ భారీ స్థాయిలో నీటిని తరలించే ప్రయత్నాలు చేస్తోందని, దీనివల్ల తెలంగాణకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ అంశాన్ని తొలుత తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, అనంతరం ఇతర రాజకీయ పార్టీలు స్పందించాయని ఆయన పేర్కొన్నారు. నీటి హక్కుల విషయంలో క్రెడిట్ రాజకీయాలకు తావులేకుండా తెలంగాణ ప్రయోజనాల కోసం అన్ని వర్గాలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన జల విధానాన్ని అమలు చేసి తెలంగాణ వాటాను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే కేంద్ర జలశక్తి శాఖకు పెద్ద ఎత్తున వినతి పత్రాలు సమర్పిస్తామని, తెలంగాణకు అన్యాయం జరగనివ్వబోమని స్పష్టం చేశారు.

## ఉప్పల్ పరిధిలోని 22-A భూముల సమస్యలు పరిష్కరించండి



**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన 22–A భూముల సమస్యపై ఉప్పల్ ఏమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్ మనూ చౌదరి ని కలిసి చర్చించారు. 22–A కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కలెక్టర్ కోరారు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యను పరిశీలించి తగిన పరిష్కారం చూపించాలని అన్నారు. ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

## ఉప్పల్‌లో రూ.3.20 కోట్లతో ఆధునిక బస్‌స్టేషన్




**ముద్ర, ఉప్పల్:** ఉప్పల్ ప్రయాణికుల సౌకర్యార్థం రూ.3.20 కోట్లతో ఆధునిక బస్‌స్టేషన్ నిర్మించనున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డితో కలిసి ఆర్టీసీ అధికారులు రామ్మోహన్, రోహిణి, వ్యాస్‌తో కలిసి వీటీ కమాన్ వద్ద బస్టాండ్ స్థలాన్ని పరిశీలించారు. నూతన బస్టాండ్‌లో బస్సుల కోసం 8–10 బస్ బేలు, సీసీ డ్రైవ్‌వేలు, విశాలమైన ప్రయాణికుల నిరీక్షణ ప్రాంగణం, వెయిటింగ్ షెడ్, మరుగుదొడ్లు, ఆర్ఓ తాగునీటి ప్లాంట్, డ్రైనేజీ, ఎల్ఈడీ లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సిబ్బందికి విశ్రాంతి గదులు, భద్రత కోసం కాంపౌండ్ వాల్ తదితర ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. పనులను త్వరలో ప్రారంభించి సకాలంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు పరమేశ్వర్ రెడ్డి వెల్లడించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 14.08.2026
www.mudranews.in | @mudranews



## బాదం నూనె : పెదాలకు కూడా ఉపయోగం

పొడిబారిన పెదాలకు బాదం నూనెను కొద్దిగా అప్లై చేయవచ్చు. ఇది పెదాలకు తేమను అందించి మృదువుగా ఉంచడంలో సహాయపడుతుంది.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, జగిత్యాల న్యూస్:** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి నూతన రేషన్ కార్డులు, పెన్షన్లపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

వితంతువులు, ఒంటరి మహిళలు, ఫైలేరియా, డయాలసిస్, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హులైన వర్గాలకు నూతన పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన వారు ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

గీత, చేనేత కార్మికులకు 50 ఏళ్ల నుంచే పెన్షన్ అందించనున్నామని, దివ్యాంగులకు 51 శాతం వైకల్యం నిబంధన ప్రకారం పెన్షన్ మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో 2,18,002 మంది లబ్ధిదారులకు నెలకు సుమారు రూ.47 కోట్ల పెన్షన్లు అందుతున్నాయని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని పేర్కొన్న మంత్రి, ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు తదితర హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గురుకులాల పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.1,000 కోట్ల బిల్లులను క్లియర్ చేశామని, సంక్షేమ హాస్టళ్ల బిల్లులను ప్రతి నెలా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. రైతులకు సాగునీటి కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో వెలుమ కార్పొరేషన్ చైర్పర్సన్ జువ్వాడ నరసింహారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు

**కేంద్ర ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి....డాక్టర్ అనుప్ రావు.**



**ముద్ర, కోరుట్ల;** దివ్యాంగులకు ప్రత్యేక శిబిరంను కోరుట్ల పట్టణంలోని సిఎంఎస్ గార్డెన్లో ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అలీంకో ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నారులకు దివ్యాంగుల సంక్షేమ కోసం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ సహకారంతో జగిత్యాల జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో దివ్యాంగులకు కృతిమ అవయవాలు, ఉచిత బ్యాటరీ సైకిల్ అందించే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో తమకు అవసరమైన కృత్తిమ అవయవాలను కొలతలు చేయించుకోవాలి, అందుకు సంబంధించిన రసీదు ను భద్ర పరుచుకోవాలనీ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో కోరుట్ల నియోజకవర్గంలో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ, జిల్లా దివ్యంగుల విభాగం నాయకుడు చేట్పల్లి ఓం ప్రకాష్, లంక దేవదాస్, మిట్టపల్లి వెంకటసాయి, ప్రధాన కార్యదర్శులు రాజేందర్, చెట్లపెల్లి సాగర్, మేకల గణేష్, గందె నవీన్, మాడవేని నరేష్, గిన్నెల శ్రీకాంత్, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కలెక్టరేట్‌లోకి షిఫ్టింగ్‌పై అధికారుల్లో తర్జనభర్జన



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్‌లోని కొత్త కలెక్టరేట్ కార్యాలయంలోకి శాఖలను తరలించే అంశంపై అధికారుల్లో అయోమయం నెలకొన్నట్లు సమాచారం. గతంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశాల మేరకు ప్రస్తుత కలెక్టరేట్‌లోని రెవెన్యూ శాఖకు చెందిన ఫర్నిచర్‌ను కొత్త భవనానికి తరలించేందుకు ఫస్ట్ ఫ్లోర్ వరండాలో ఉంచారు. అయితే కొత్త కలెక్టరేట్ ప్రారంభోత్సవ తేదీ ఇంకా ఖరారు కాకపోవడంతో సామగ్రిని తరలించాలా? వద్దా? అనే దానిపై అధికారులు నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు తెలిసింది. ప్రారంభోత్సవం ఎప్పుడు జరుగుతుందనే దానిపై స్పష్టత వచ్చిన తర్వాతే షిఫ్టింగ్‌పై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

## భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

* ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
* ఫర్నిచర్, బెంచీలు ఎక్కువ ఉంటే మరో స్కూల్ కు తరలించాలి స్క్రాప్ ను తొలగించాలి
* వనరులను సమర్థవంతంగా వినియోగించాలి
* కలెక్టర్ చిత్రా మిశ్రా



**ముద్ర, కరీంనగర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమి చ్చి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రం లోని ధన్గర్ వాడీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. భవిత కేంద్రంలో గదులు కలియ తిరుగుతూ రిజిస్టర్ పరిశీలించారు. పిల్లలు, సిబ్బంది వివరాలు, చిన్నారులకు అందిస్తున్న ఫుడ్ వివరాలు, ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. జిల్లాలోని 16 భవిత కేంద్రాల్లో తాగునీరు(వాటర్ డిస్పెన్సరీలు ) ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సైతం యూనిఫామ్, పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రంలో పేరెంట్స్ వెయిటింగ్ రూమ్, ప్రత్యేక వాష్ రూమ్, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ప్లేట్లు, గ్లాసులు అందించాలన్నారు. ప్రతి భవిత కేంద్రంలో సరిపడా సిబ్బంది (సమ్మిళిత విద్యా బోధకులు) ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి గదులు పరిశీలించారు.. అందిస్తున్న సౌకర్యాలు తెలుసుకున్నారు.

పాఠశాలలో వృధాగా ఫర్నిచర్, బెంచీలు ఉండటంపై అసహన వ్యక్తం చేశారు. ఏర్పాట్లు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్, బెంచీలను అవసరమైన పాఠశాలలకు తరలించాలని ఆదేశించారు. పిల్లలు కింద కూర్చోకుండా విధిగా బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. స్క్రాప్ ను తొలగించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉన్న వనరులను వృధాగా ఉంచకుండా వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

**అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన**

ఆ తర్వాత డాక్టర్ స్ట్రీట్ లో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. స్కూల్ భవనం శిథిలావస్థకు చేరినందున.. మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అప్పటివరకు తాత్కాలికంగా ముకరంపురలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్లోకి ఈ స్కూల్ ను తరలించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హై స్కూల్ తరగతి గదులు శిథిలావస్థకు చేరినందున తొలగించి.. పెద్ద భవనం నిర్మించాలన్నారు. భవనం చుట్టూ ప్రహరీ, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మార్ట్ సిటీ కింద ఏ పాఠశాలల్లో ఎన్ని నిధులు ఖర్చు చేశారో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు.

## దేశం కోసం పోరాడిన వ్యక్తులను స్మరించుకోవాలి

**బిజెపి పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో "హర్ గర్ తిరంగా"**



**ముద్ర, కోరుట్ల;** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు బిజెపి పార్టీ మండల శాఖ అధ్యక్షులు మల్యాల మారుతి ఆధ్వర్యంలో "హర్ గర్ తిరంగా" ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతు దేశవ్యాప్తంగా "హార్ ఘర్ తిరంగా" ర్యాలీలు చెప్పట్టడం జరిగిందన్నారు. ప్రజలలో దేశభక్తి ని పెంచడమే లక్ష్యంగా, దేశం కోసం పోరాడిన వ్యక్తులను స్మరించుకోవడం కోసం ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. 2047 వరకు ప్రపంచంలో భారత దేశాన్ని విశ్వగురువుగా ఎదగడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంతో ముందుకెళుతున్నారని అన్నారు. జెండా పట్టుకుంటే ర్యాలీ అవుతుందనీ, గుండెలో ఉంటే దేశ భక్తి అవుతుందన్నారు. ప్రతి ఒక్క పౌరుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కొడిపెల్లి గోపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి నరెడ్ల రవి, కథలాపూర్ మహేష్, సీనియర్ నాయకులు బద్రి సత్యం, గాందరి శ్రీనివాస్, పాల్గొన్నారు.

## బోధనా రుసములు విడుదల చేయాలని ఆందోళన




**ముద్ర, కరీంనగర్ :** బోధనా రుసుములు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. తొలుత తెలంగాణ చౌక్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున విద్యార్థులు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బోధనా రుసుములు విడుదల చేయకపోవడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే బోధనా రుసుములను విడుదల చేయకపోతే కాంగ్రెస్ నాయకుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు.

## పేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్**



**ముద్ర, వెల్గటూర్:** ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 80 మంది లబ్ధిదారులకు రూ.25.56 లక్షలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన సమయంలో ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, పేద కుటుంబాల ఆర్థిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్: రేపు కరెంట్ బంద్

**ముద్ర, కరీంనగర్ :** చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు టౌన్-1, 2, రూరల్ ADEలు శ్రీనివాస్, లావణ్య, రఘు తెలిపారు. ఐబీ చౌరస్తా, సర్కస్ గ్రౌండ్, పద్మనాయక ఫంక్షన్ హాల్, సాఫ్రాన్ స్వీట్ హౌస్, కోర్టు చౌరస్తా ఏరియాల్లో ఉ.8 గం.ల నుండి 10:30, కొత్తపల్లి టౌన్, రెడ్డిరాంపల్లి, తూర్పువాడ, మెడికల్ ఏరియా, రామాలయం ఏరియాల్లో ఉ.10 గం.ల నుండి మ.ఒంటి గంట వరకు కరెంట్ ఉండదన్నారు

## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**ముద్ర, కరీంనగర్ :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా కరీంనగర్ నగరంలో భాజపా ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు జాతీయ జెండాలు పట్టుకుని విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని ప్రధాన వీధుల గుండా సాగుతూ ఎస్ఆర్ఆర్ కళాశాల మీదుగా కోర్టు చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు..

## ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జెండా ఆవిష్కరణకు ప్రముఖుల నియామకం









**ముద్ర, కరీంనగర్:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించేందుకు ప్రభుత్వం పలువురిని నియమించింది. కరీంనగర్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

జగిత్యాల జిల్లా కేంద్రంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు జాతీయ జెండాలను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 14.08.2026
www.mudranews.in | @mudranews



**బాదం నూనె :**
జుట్టు పొడిబారకుం డాబాదం నూనెను జుట్టు, ముఖ్యంగా హెయిర్ ఎండ్స్‌కు తక్కువ మోతాదులో రాయడం వల్ల పొడిబారడం తగ్గి జుట్టు సాఫ్ట్‌గా మారుతుంది.



# ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లా కేంద్రంలో భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ తడిసిన మల్లారెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి రైల్వే స్టేషన్ నుండి వినాయక చౌరస్తా వరకు జాతీయ పతాకాలతో విద్యార్థులు యువకులు స్థానిక ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో 'భారతమాతకు జై', 'వందే మాతరం' అంటూ దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీ ఉత్సాహంగా ముందుకు సాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసినటువంటి మాజీ పార్లమెంట్ సభ్యులు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. దేశ స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు దేశ భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత మీపై ఉంది. దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగుతూ భారతదేశాన్ని మరింత శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడంలో మీ వంతు పాత్ర పోషించాలి" అని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూర్ అశోక్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జాతీయ భావాలు పెంపొందించుకోవాలి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరు తమ తమ ఇంటి పైన జాతీయ జెండాని ఎగరవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా కో – కన్వీనర్ పట్నం కపిల్, బిజెపి రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి, పాశం భాస్కర్, మాయ దశరథ, తుమ్మల మురళీధర్ రెడ్డి, చందుపట్ల వెంకటేశ్వరరావు, పడమటి జగన్మోహన్ రెడ్డి, చందా మహేందర్,కొప్పుల యాదిరెడ్డి, కదూరి అచ్చయ్య, జైనపల్లి శ్యామ్ సుందర్, పట్నం శ్రీనివాస్, గూడూరు నారోత్తం రెడ్డి, తిరంగ్ కమిటి సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఎర్రజెండాల హోరు

- అరుణావర్ణ శోభితమైన పుర వీధులు
- సీపీఐ 'ప్రజా చైతన్య యాత్ర' ముగింపు సభలో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఘాటు వ్యాఖ్యలు
- పదవులు, సీట్ల కోసం ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ప్రసక్తే లేదు
- ఖమ్మం జిల్లాలో గెలుపే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో సిద్ధం కావాలి






**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం నగరం ఎరుపు రంగు పులుముకుంది. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ప్రదర్శనతో పుర వీధులన్నీ అరుణావర్ణ శోభితంగా మారాయి. గత ఎనిమిది రోజులుగా సాగిన 'ప్రజా చైతన్య యాత్ర' ముగింపు సందర్భంగా ఖమ్మం నగరంలో ఈ భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం, కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తిని ఆకాంక్షిస్తూ వేలాది మంది శ్రేణులతో సాగిన ఈ ప్రదర్శన నగరంలో తీవ్ర ఉత్సాహాన్ని నింపింది. ఎర్రజెండాల రెపరెపలు, విప్లవ నినాదాలతో ఖమ్మం వీధులు మార్మోగాయి.ర్యాలీ అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన ముగింపు సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.సమాజంలో గుణాత్మక మార్పు తీసుకురావడం కేవలం కమ్యూనిస్టు పార్టీలకే సాధ్యమని, ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు చేయడమే తమ ఆశయమని కూనంనేని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయించిన ఘనత కమ్యూనిస్టుల పోరాట పటిమదేనని కొనియాడారు.పేద ప్రజల కష్టాలు, కన్నీళ్ల నుంచే కమ్యూనిస్టు పార్టీ పుట్టింది. కార్యకర్తలు తమ హృదయాల నుంచి నిరాశ, పిరికితనాన్ని తొలగించి పోరాటాలకు సిద్ధం కావాలి. నరేంద్ర మోదీ, అమిత్ షాల ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసే నైతిక శక్తి ఒక్క కమ్యూనిజానికే ఉంది. కేంద్రంలోని బీజేపీ పాలన వారి స్వయంకృత నేరాల వల్లనే పతనం వైపు సాగుతోంది.దేశంలో విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని కూనంనేని ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ వంటి ప్రాంతాల్లో విద్యార్థులు చేపట్టిన నిరసనలు ఇక్కడి పాలకులకు కళ్లు తెరిపించాలని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ పాలనలో సామాన్యులు అల్లాడుతుంటే, అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు మాత్రమే సంతోషంగా ఉన్నారని విమర్శించారు.ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టం:రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై కూనంనేని తీవ్రంగా స్పందించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే తమ నైజమని, కేవలం ఒక ఎమ్మెల్యే సీటు కోసమో లేక పదవుల కోసమో తమ కార్యకర్తల మనోభావాలను, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మేలు చేసే పార్టీలకు మాత్రమే సహకరిస్తామని, అవసరమైతే ఒంటరిగానే బరిలోకి దిగుతామని స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లాలో గెలుపే లక్ష్యం:రాబోయే రోజుల్లో ఖమ్మం జిల్లాలోని రెండు అసెంబ్లీ స్థానాలను టార్గెట్‌గా పెట్టుకొని, కనీసం ఒక స్థానంలోనైనా విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. 8 రోజుల పాటు సాగిన ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, శ్రేణులకు విప్లవాత్మక అభినందనలు తెలిపారు.ఈ ముగింపు సభలో సీపీఐ రాష్ట్ర నాయకులు మహ్మద్ మౌలానా, బాగంహేమతరావు, దండి సురేష్, జితేందర్ రెడ్డి ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళిత డిక్లరేషన్ అమలు చేయాలి

### తుంగతుర్తి లో బి ఆర్ ఎస్ పార్టీ దళిత శ్రేణులు.. నిరసన



**ముద్ర తుంగతుర్తి:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అధికారం రావడం కోసం చేవెళ్ల లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గే తో దళిత డిక్లరేషన్ విడుదల చేసి అధికారం వచ్చి మూడేండ్ల అయిన అందులో చెప్పిన అంబేద్కర్ అభయహస్తం పేరుతో చెప్పిన పన్నెండు లక్షల ఆర్థికసాయం కాని విదేశాల్లో చదువుకున్న దళిత విద్యార్థులకు 20లక్షల ఓవర్సీస్ స్కాలర్ షిప్పు లాంటి ఏ ఒక్క వాగ్దానాన్ని కూడ అమలు చేయ లేదని అన్నారు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొట్లాది రూపాయలు నిధులు విడుదల చేసి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పి మూడేండ్ల అయిన ఒక్కరూపాయి కూడ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత కుటుంబాలకు అందించలేదని అన్నారు. రాష్ట్రం లో అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకుండా ప్రజాపాలన పేరుతోదగా పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్టీకి భవిష్యత్ లో తగిన గుణ పాఠం చెప్పాలని అన్నారు కెసిఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లానాయకులు గుండగాని రాములుగౌడ్ మండల నాయకులు గోపగాని రమేష్ పూర్ణ నాయక్. వీరోజీ నాయక్. సుధాకర్ నాయక్. దళిత నాయకులు సర్పంచ్ తప్పేట్ల ఎల్లయ్య. మాతంగి కరుణాకర్ ఆకారపు భాస్కర్ కదారిదాసు పోలెపాక సోమయ్య బల్లెం ప్రవీణ్. చింతకుంట్ల భాస్కర్గోపగాని శ్రీనివాస్ మల్లేపకా రాములు గడ్డం సోమేశ్. మల్లేపక కరుణాకర్. దుబ్బాక విజయ్. బొల్లెద్దు శ్రవణ్. పుల్లూరి పరుశురాం. బొంకూరి శ్యామ్ పోలేపాక రాజేష్ బొంకూరి సాయి.పోలేపాక పరమేష్ కొండగడుపుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## వికలాంగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

### ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రాష్ట్ర ప్రభుత్వం ఆగష్టు 15 న కొత్తగా మంజూరు చేస్తున్న చేయూత పెన్షన్లలో వైకల్య ధ్రువీకరణ పత్రాలు పొందిన వికలాంగులందరిని పెన్షన్స్ మంజూరు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ( ఎన్ పి ఆర్ డి ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని సుందరయ్య భవన్ లో జిల్లా కోశాధికారి కె లలిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలోని వికలాంగుల సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల సంక్షేమన్ని పట్టించుకోవడం లేదని, 12 ఏండ్ల నుండి దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలనలో దేశంలో వికలాంగులు అన్ని రంగాల్లో వెనకబడినరాని అన్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం, 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్, నేషనల్ పాలసీ, నేషనల్ ట్రస్ట్ వంటి చట్టాల అమలు చేయడం లేదని అన్నారు. 2016 వికలాంగుల చట్టం చీఫ్ కమిషనర్ పోస్టును భర్తీ ఎందుకు చేయడం లేదని అన్నారు. వికలాంగుల పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా 300 నుండి 5000 లకు పెంచాలని డిమాండ్ చేశారు. విబి జి రామ్ జి 2025 అమలు చేయడం అంటే వికలాంగుల జీవనోపాదిని దెబ్బతీయడమే అవుతుందని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బోల్లేపల్లి స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షులు చిత్తలూరి శ్రీహరి, భగవంత్ రెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు గోపి, రాధకృష్ణ పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**ముద్ర, దేవరకొండ:** దేవరకొండ పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రాంజీ నాయక్ హాస్పిటల్‌ను స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ దేవరకొండ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో ఆసుపత్రి సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. రాంజీ నాయక్ హాస్పిటల్ ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందిస్తూ ఆరోగ్య సేవల్లో మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు అత్యవసర వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రి ప్రారంభ కార్యక్రమంలో వైద్యులు రాంజీ నాయక్, ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ రవి ప్రకాష్, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులు పాల్గొని నూతనb ఆసుపత్రి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## హమాలీలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల హామాలి కార్మికులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని అసంఘటిత రంగ కార్మికులుగా పేర్లు నమోదు చేయాలని ఆల్ హామాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి పాండు అన్నారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం హమాలి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని హమాలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భువనగిరి తాసిల్దార్ జగన్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి నేటికి ఏళ్ళు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ అమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసు, ఎల్లయ్య, సత్యనారాయణ, కోటయ్య పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మండలంలోని కూనూరు గ్రామంలో గురువారం పొలోమీ హాస్పిటల్, డాక్టర్ అగర్వాల్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మందికి పైగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసిజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాశం శివానంద్, డాక్టర్లు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ముద్ర, దేవరకొండ:** ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యుఎస్పిసి తలపెట్టిన దశల వారి పోరాటంలో భాగంగా గురువారం కొండమల్లేపల్లి మండల తహసిల్దార్ కి టీఎస్ యూటీఎఫ్ కొండమల్లేపల్లి మండల శాఖ తరపున వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్ భాను ప్రకాష్ మాట్లాడుతూ పిఆర్సి నివేదికను తెప్పించుకొని వెంటనే పిఆర్సి ప్రకటించాలని పెండింగ్ లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను ప్రకటించాలని రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయిలను సత్వరమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు నరేందర్, ప్రధాన కార్యదర్శి చిన్న ముత్యాలు, ఉపాధ్యక్షులు దేవుల్లయ్య, శోభారాణి, టిడబ్ల్యూఎఫ్ కన్వీనర్ కోటయ్య, టిఎస్ యుటిఎఫ్ పూర్వ జిల్లా కార్యదర్శి పులిగిల్ల గోవర్ధన్ రావు, వివిధ సంఘాల బాధ్యులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### బునాదిగాని కాలువ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



**ముద్ర, బీబీనగర్:** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ బునాదిగాని కాలువపై చేపట్టిన కొత్త బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తికావడంతో గురువారం బీబీనగర్ మండలం మక్తఅనంతారం వద్ద కాలువకు నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాక్స్ కల్వర్టుల నిర్మాణం పూర్తికావడంతో కాలువలో నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని, ఆయకట్టు పరిధిలోని చివరి రైతు వరకు సాగునీరు సక్రమంగా చేరేందుకు మార్గం సుగమమైందని తెలిపారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా కాలువల అభివృద్ధి, ఆధునికరణ, అవసరమైన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు.బునాదిగాని కాలువ పరిధిలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలిగించే ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు సక్రమంగా చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రవాహంలో ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ కాలువల ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు.కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పొట్టోల శ్యామ్‌గౌడ్, సీనియర్ నాయకులు పంజాల రామాంజనేయులు, గోలి పింగల్‌రెడ్డి, గోలి నరేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురకంటి సత్తిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మండల నాయకులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ఈఈ శైలేందర్, డీఈ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరకీ చేయూత ఫించన్లకు చర్యలు



### చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** అర్హులందరికీ చేయూత ఫించన్ల మంజూరీకి చర్యలు తీసుకోవాలని చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం చేయూత ఫించన్లపై భువనగిరి పురపాలక సంఘం కార్యాలయంలో ఆమె అధ్యక్షతన ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారుల జాబితాను వార్డు వారీగా పరిశీలించాలని, కొత్త దరఖాస్తులు స్వీకరించి, అర్హత ఉన్న వారందరికీ చేయూత ఫించన్ మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సభ్యులందరికీ రాష్ట్ర ప్రభుత్వం వారు ఇచ్చిన మార్గదర్శకాలు, నియమ నిబంధనల గురించి తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, కమిషనర్ కె. చంద్ర ప్రకాష్ రెడ్డి, గౌరవ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఓబీసీ జిల్లా అబ్జర్వర్‌గా మేకల బాలు యాదవ్

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఓబీసీ డిపార్ట్‌మెంట్ జనగాం జిల్లా అబ్జర్వర్‌గా మేకల బాలు యాదవ్ నియామకం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాలు యాదవ్ మాట్లాడుతూ ఓబీసీ వర్గాల పట్ల చిత్తశుద్ధి, పార్టీ కోసం చేస్తున్న సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డికి, టీపీసీసీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ కన్వీనర్లకు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడిన తరగతుల (ఓబీసీ ) సంక్షేమం, హక్కుల సాధన కోసం పార్టీ ఎంతో కృషి చేస్తోందని అన్నారు.

**బాదం నూనె:**



చర్మానికి సహజ మాయిశ్చరైజర్ బాదం నూనెను కొద్దిమొత్తాదులో చర్మానికి రాసుకోవడం వల్ల పొడిబారిన చర్మానికి తేమ అందుతుంది. చర్మం మృదువుగా, కాంతివంతంగా కనిపించేందుకు ఇది సహాయపడుతుంది.

# విధ్వంసం నుంచి.. వికాసం వైపు..

### కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్లకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, కూకట్‌పల్లి :** గత పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం తీవ్ర విధ్వంసానికి గురైందని, దానిని అధిగమించి రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించేందుకు తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ (కేబీహెచ్‌బీ) కాలనీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల టవర్ పనులకు గురువారం ఆయన భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి విషయాల్లో గత బీఆర్ఎస్ రజాకార్ల తరహా పాలనను, తమ ప్రస్తుత ఇందిరమ్మ పాలనను ప్రజలు బేరీజు వేసుకొని ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు.సంక్షేమానికి పెద్దపీట – మహిళా సాధికారతకు ప్రాధాన్యంకేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని సీఎం విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. ఉచిత హామీల అమలు: రాష్ట్రంలో 3.28 కోట్ల మందికి సన్న బియ్యం, 55 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నట్లు తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్: గతంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను రూ.1,200కు పెంచితే, మహిళల కష్టాలను గుర్తించి తమ ప్రభుత్వం రూ.500కే సిలిండర్ అందిస్తోందన్నారు. మహిళలకు ఆర్థిక తోడ్పాటు: ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కోసం ఇప్పటికే రూ.12,000 కోట్లు ఖర్చు చేశామని, స్వయం సహాయక సంఘాలకు ₹65,000 కోట్ల రుణాలు అందించామని చెప్పారు. వెయ్యి బస్సులకు, సోలార్ విద్యుత్ ప్లాంట్లకు, పెట్రోల్ బంకులకు మహిళలనే యజమానులుగా తీర్చిదిద్దామని తెలిపారు. హైటెక్ సిటీలో ప్రత్యేక స్టాళ్లు: మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను విక్రయించుకోవడానికి హైటెక్ సిటీ ప్రాంతంలో 3.5 ఎకరాల్లో ఉచిత స్టాళ్లను కేటాయించినట్లు వెల్లడించారు. రూ.70 వేల కోట్ల



అప్పులు తీరుస్తూనే అభివృద్ధిగత ప్రభుత్వం రాష్ట్రంపై రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారం మోపి వెళ్ళిందని, ప్రస్తుతం అసలు, వడ్డీ కలిపి నెలకు రూ.70,000 కోట్లు చెల్లిస్తూ కూడా సంక్షేమ పథకాలను రాజీ లేకుండా అమలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.గత ప్రభుత్వంలా విలువైన ప్రభుత్వ భూములను అమ్ముకొని సొమ్ము చేసుకోం. ప్రజల అవసరాలకు మాత్రమే వాటిని వినియోగిస్తాం. హైటెక్ సిటీలోని 5 ఎకరాల్లో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాం."రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రికూకట్‌పల్లిలో 11 ఎకరాల్లో పేదలకు సొంతింటి కలకూకట్‌పల్లిలోని అత్యంత విలువైన 11 ఎకరాల స్థలంలో పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. లబ్ధిదారుల నుండి భూమి విలువను వసూలు చేయడం లేదని, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా పూర్తిగా మినహాయించామని చెప్పారు. కేవలం ₹5 నుండి ₹6 లక్షల నిర్మాణ వ్యయంలో భాగస్వాములను చేస్తూ సొంతింటి కలను నిజం చేస్తున్నామన్నారు. కొడంగల్‌లో ఓడిపోయిన సమయంలో పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించి తనకు పునర్జన్మనిచ్చిన కూకట్‌పల్లి ప్రాంతాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని, ఈ బాధ్యతను జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు.క్షుద్రపూజలు,



చేతబడులు చేయిస్తూ ప్రభుత్వంపై కుట్రలు పన్నుతున్న ప్రతిపక్ష నేతలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని సీఎం హెచ్చరించారు.ఏడాదిలోగా ఇళ్ల పంపిణీ: మంత్రుల హామీ గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి: "గత ప్రభుత్వం కమిషన్ల కోసం ప్రాజెక్టులు నిర్మిస్తే, తమ ప్రభుత్వం పేదవాడే ఎజెండాగా పనిచేస్తోంది. ఏడాది లోపు అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను అందజేస్తాం. గత పదేళ్లలో నిర్మించిన దానికి రెట్టింపు ఇళ్లను కట్టి ఇవ్వకపోతే రాబోయే ఎన్నికల్లో పోటీ చేయను" అని సవాల్ విసిరారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు: జంట నగరాల్లో దశల వారీగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని, ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరే వరకు ఈ పథకం కొనసాగుతుందని స్పష్టం చేశారు.హాజరైన ప్రముఖులు:ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ఆరెకపూడి గాంధీ, నవీన్ యాదవ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, హౌసింగ్ బోర్డ్ MD గౌతమ్, కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్, వజ్రేష్ యాదవ్, జగదీశ్వర్ గౌడ్, కొలను హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కలతోనే సరైన అభివృద్ధి

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జనగణన – 2027 సన్నాహకాల్లో భాగంగా జిల్లా జనాభా లెక్కల హ్యాండ్ బుక్ అత్యంత ప్రామాణికమైనదని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ఆర్డీఓలు, తహసిల్దార్లు, వివిధ శాఖల అధికారులతో జిల్లా జనాభా లెక్కల హ్యాండ్ బుక్ తయారీపై గూగుల్ మీట్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రణాళికాబద్ధమైన భవిష్యత్తు అభివృద్ధికి జనాభా లెక్కలు దోహదం చేస్తాయన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి రంగం సమగ్ర సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. మున్సిపల్, విద్య, వైద్య ఆరోగ్య, హౌసింగ్, ఆర్ అండ్ బీ వంటి వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు.గ్రామాలు, పట్టణాల వారీగా జనాభా వివరాలు నమోదు చేయడం,,మౌలిక వసతులు, విద్య, వైద్యం పౌర సౌకర్యాల సమాచారం సేకరించడం, డిజిటల్ యాప్‌లు లేదా వెబ్ పోర్టల్స్ ద్వారా ఖచ్చితమైన డేటాను క్రోడీకరించడం, రెవెన్యూ గ్రామాల స్థాయిలో అధికారుల ద్వారా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ గూగుల్ మీట్ లో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీవోలు, రమాదేవి, రామకృష్ణ, బావయ్య, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

**ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి**

రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుండి జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. జిల్లాలోని పంటల వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారని, వరి పంటను సాగు చేస్తున్న వర్షాలు తగ్గడం వల్ల వరి పంటలు ఎండిపోయే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి పరిస్థితులపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లోని గ్రామ సర్పంచులకు, రైతులకు ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ మీట్ లో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఐవీ / ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గణేశ్వర్ మాట్లాడుతూ...హెచ్ఐవీకి ప్రస్తుతం పూర్తిస్థాయి నివారణ మందు లేదని, వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ముఖ్యమని తెలిపారు.యువత హెచ్ఐవీతో పాటు లైంగికంగా సంక్రమించే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని, అపోహలకు దూరంగా ఉండి బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని పాటించాలని ఆయన సూచించారు. డాక్టర్ హరికృష్ణ, ఐసీటీసీ కౌన్సిలర్లు గోపి, సుధాకర్, రవి, లైంగిక వ్యాధుల కౌన్సిలర్ రాజేశ్వర్, స్కోప్ ఎన్జీవో ప్రతినిధి ఉప్పలయ్య, లింక్ వర్కర్ ప్రోగ్రాం ప్రతినిధులు లక్ష్మణ్, అనిల్, ఔట్రీచ్ వర్కర్లు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకల అతిథిగా మంత్రి వివేక్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరుకానున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించి, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేస్తోందని తెలిపారు.

**ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డిఓ రమాదేవి**



పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఏర్పాట్లను ఆర్డిఓ రమాదేవి పరిశీలించారు. వేడుకల వేదిక, పరేడ్, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

## కుమ్మరులను పూజారులుగా నియమించాలి



**ముద్ర, తుంగతుర్తి:** గ్రామదేవతల ఆలయాల్లో కుమ్మరి కులస్తులను పూజారులుగా నియమించి, ప్రభుత్వం నెలకు రూ.10 వేల గౌరవ వేతనం అందించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు డిమాండ్ చేశారు.గురువారం తుంగతుర్తి మార్కండేయ భవన్‌లో 16 గ్రామాల ప్రతినిధుల సమావేశం నిర్వహించి మండల, యువజన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మద్దికుంట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, యూత్ అధ్యక్షుడిగా మద్దికుంట్ల రవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం ఎన్నికయ్యారు.కుమ్మరోళ్లకు గ్రామదేవతల ఆలయాల్లో పూజారులుగా అవకాశం కల్పించడం ద్వారా సామాజిక సమానత్వం బలోపేతం అవుతుందని, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు భరోసా కలుగుతుందని సంఘం నాయకులు అన్నారు. కార్యక్రమంలో వీరేంద్ర, రామారావు, ఖమ్మంపాటి మధుసూదన్, నాగయ్య, లింగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో చెట్టు కొమ్మ పడి విద్యార్థి మృతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ చౌరస్తా వద్ద ఉన్న బగాయత్ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆటలు ఆడుతున్న సమయంలో వేప చెట్టు కొమ్మ విరిగిపడి పలువురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక్కసారిగా చెట్టు కొమ్మ విరిగిపడటంతో విద్యార్థులు భయ కంపితులై పరుగులు పెట్టారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, గాయపడిన విద్యార్థులను హుటాహుటిన భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం, వైద్యుల సలహా మేరకు నలుగురు విద్యార్థులను బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. భువనగిరి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దావుద్ అలీ, అమీనా లో కూతురు "అలీమ" మృతి చెందింది. హర్షిత్, మరో విద్యార్థికి కాళ్ళు విరిగాయని ఎయిమ్స్ వైద్యులు తెలిపారు.విషాద సంఘటన జరగడానికి కారణాలు భువనగిరి బగాయత్ పాఠశాల



ఆవరణ తాగుబోతు లకు అడ్డాగా మారింది. ఒక ప్రాథమిక పాఠశాల, హైస్కూల్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఒకే ఆవరణలో ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, పోలీసుల పెట్రోలింగ్ సక్రమంగా జరగకపోవడంతో తాగుబోతులు వికృత చేష్టలకు అడ్డాగా మారింది. గత వారం క్రితం తాగుబోతులు ఒక వేపచెట్టును తగులబెట్టినట్లు సమాచారం. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినట్లు స్థానికులు చెబుతున్నారు. వేప చెట్టు కాలిపోవడంతో తొర్ర ఏర్పడి, చెట్టు పటుత్వం తప్పి కూలిపోయినట్లు తెలుస్తోంది.విద్యార్థి కుటుంబానికి 50 లక్షల పరిహారం ఇవ్వాలి భువనగిరి బగాయత్ పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుతున్న మూడవ తరగతి విద్యార్థి అలీమ మృతి చెందడం బాధాకరమని, అలీమ కుటుంబానికి , ప్రభుత్వం 50 లక్షల రూపాయల పరిహారం అందించి ఆదుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు కొడారి వెంకటేష్ డిమాండ్ చేశారు.

## రూప హత్య కేసు నిందితులను త్వరలో పట్టుకుంటాం

### నల్గొండ ఎస్పి శరత్చంద్ర పవార్

**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రూప రెడ్డి హత్యకు గురైన ఇంటిని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ గురువారం పరిశీలించారు. ఇంటి పరిసరాలలో తిరిగి నిందితుడు ప్రవేశించిన విధానాన్ని హత్య చేసిన ప్రాంతాన్ని ఆయన ఇల్లు అంతా తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. నిందితుడు ఏ మార్గంలో వచ్చాడు ఎలా దాడి చేశాడు అనే కోణంలో ఇంటిని అంతటా కలియదిరిగారు. అనంతరం రూప రెడ్డి భర్త రాజేందర్ రెడ్డిని అడిగి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి హత్య జరిగిన గదిని పరిశీలించి డిఎస్పి శ్రీనివాస్ రావు, సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్ లను కూడా కేసు విషయమై విచారణ తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ మూడు బృందాలుగా పోలీస్ సిబ్బంది విచారణ చేపడుతున్నారని సిసి పుటేజీ ఫింగర్ ప్రింట్ తో పాటు అన్ని కోణాల్లో కేసును విచారించి నిందితుడిని గుర్తించి పట్టుకొని హత్య కేసును అతి తొందరలోనే చేదిస్తామని ఎస్పి తెలిపారు. కేసు దర్యాప్తును పారదర్శకంగా తక్షణమే పూర్తి చేయాలని స్థానిక పోలీసు అధికారులను ఎస్పి ఆదేశించారు. అనంతరం కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించి పాత కేసుల పురోగతిని, పోలీస్ స్టేషన్ రికార్డులను, పోలీసుల పనితీరును, పోలీస్ స్టేషన్ స్థానిక పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పట్టణంలోని శాంతిభద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు అవగాహన కల్పించారు. వారివెంట స్థానిక పోలీసులు వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## వీధి కుక్కల స్వైర విహారం..

**ప్రజలకు తప్పని ఇబ్బందులు**
**కుక్కల నియంత్రణకు చర్యలేవి?**
**ఇంకెంత మంది కుక్కకాట్లకు గురైతే స్పందిస్తారు?**



**ముద్ర, దేవరకొండ:** దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. ప్రధాన రహదారులు, కాలనీలు, పాఠశాలలు, ఆసుపత్రుల పరిసరాల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం, రాత్రి వేళల్లో పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెంటపడుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.ఇప్పటికే పలువురు కుక్కకాట్లకు గురవుతున్నా సమస్య పరిష్కారానికి అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో స్పష్టత లేదని అంటున్నారు.''ఇంకెంత మంది కుక్కకాట్లకు గురైతే అధికారులు స్పందిస్తారు?'' అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించకుండా ముందుగానే సమస్యను గుర్తించి చట్టబద్ధమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే చొరవ తీసుకుని దేవరకొండ ప్రజలకు వీధి కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# కమిటీలు చట్టసభలకు వెన్నెముక

### గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ శాసన మండలి ప్రివిలేజెస్ (విశేషాధికార) కమిటీ, ప్రభుత్వ హామీల కమిటీ, సభలో ప్రతుల వితరణ కమిటీల ప్రారంభోత్సవ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌తో పాటు పలువురు ఎమ్మెల్సీలు, అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కమిటీలు చట్టసభలకు వెన్నెముక వంటివని పేర్కొన్నారు. కమిటీల్లో చురుకుగా పనిచేయడం ద్వారా సభ్యులకు మేధస్సు, అనుభవం పెరుగుతాయని అన్నారు. కమిటీల్లో సభ్యులుగా ఉండటాన్ని బాధ్యతగా భావించాలని, అలసత్వం వహించకూడదని సూచించారు. తాను గతంలో మూడు పర్యాయాలు పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న




సమయంలో వివిధ పార్లమెంటరీ కమిటీల్లో పనిచేశానని, ఆ అనుభవం తనకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు.కమిటీ చైర్మన్లు, సభ్యులు స్టడీ టూర్లు నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా చట్టసభలకు మెరుగైన సేవలు అందించాలని గుత్తా సూచించారు. ప్రోటోకాల్ విషయంలో ఎమ్మెల్సీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, నిబంధనలు పాటించకపోతే ప్రివిలేజ్ కమిటీ ద్వారా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ.. తెలంగాణ శాసన మండలిలో కమిటీలను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. సభ మర్యాదలు, గౌరవాన్ని కాపాడే విధంగా కమిటీలు పనిచేయాలని సూచించారు. కమిటీ సభ్యులందరినీ కలుపుకుని ముందుకు సాగుతూ తన కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, దండే విఠల్, చల్లా వెంకట్రామిరెడ్డి, కోటిరెడ్డి, నవీన్‌కుమార్, నెల్లికంటి సత్యం, శంకర్‌నాయక్, భాను ప్రసాదరావు, తాతా మధు, రవీందర్‌రావుతో పాటు శాసన మండలి కార్యదర్శి డా. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555